

మీరే నా బలం : జనసైనికులకు పవన్ అభివాదం



ఇదీ నా సేన : జయకేతనం సభా వేదికపై పవన్‌తో పాటు నాయకులు



జన పవనాలు!





అంతా ఓకేనా : నాదెండ్లతో మాట్లాడుతున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్



అభిమానమే.. బలం : జయకేతనం సభా వేదికపై మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్



జన సైనికులమే : సభా వేదికపై ఆశీనులైన మహిళలు.. ఇతర నాయకులు



ఎగసిపడిన పవన్ అభిమానం



జన సైనికులే..జనసేన బలం

- బంధం.. అనుబంధం మీరే
- మీ అందరి శ్రమతోనే అధికారంలోకి..
- వైసీపీ అరాచకాలను బద్దలు కొట్టాం
- మమ్మల్ని మీరే క్రమశిక్షణలో ఉంచాలి
- చిత్రాడ సభలో పవన్ కల్యాణ్
- అంచనాలకు మించి జనం
- మధ్యాహ్నానికే నిండిన వేదిక
- చోటులేక బయట వేలల్లో
- అదిరిపోయిన ఏర్పాట్లు
- వహ్వా అనిపించిన ఆతిథ్యం
- తరలివచ్చిన మహిళలు
- తీవ్ర ఎండతో ఇబ్బందులు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

చిత్రాడ దద్దరిల్లింది.. జన సందోహంతో గర్జించింది.. అంచనాలకు మించి తరలివచ్చిన జనంతో పోటెత్తింది.. ఆవిర్భావ సభ పండగను సంతరించుకుంది.. కనుచూపుమేరలో జనం..కళ్లు మిరిమిట్లు గొలిపేలా లైటింగ్.. వేలల్లో బారులు తీరిన బస్సులు.. కార్లు.. కనివినీ ఎరుగని ఏర్పాట్లతో నభూతో నభవిష్యత్తు అనే తరహాలో జయకేతనం సభ జయజయ ధ్వానాలతో దద్దరిల్లింది..అటు జనసేనాని పవన్‌కల్యాణ్ తన ప్రసంగంలో జనసైనికుల గురించే అధికంగా ప్రస్తావించి వారి మనసులు గెలుచుకున్నారు. పార్టీ నూరుశాతం స్ట్రైక్ రేట్ సాధించడంలో వారి పాత్ర ఎనలేనిదని కొనియాడి అందరి గుండెలను తట్టారు. ఇన్నేళ్లలో ఎందరో జనసైనికులు పార్టీ సిద్ధాంతాల కోసం చనిపోయిన వైనాన్ని గుర్తుచేసి వారి సేవలు ఎనలేనివని కొనియాడారు. వెరసి జనసైనికులతోనే తన బంధం.. అనుబంధం అని వెల్లడించి పార్టీ క్యాడర్ తన దృష్టిలో ఎంత గొప్పస్థానం దక్కించుకున్నారో వివరించి అందరితో చప్పట్లు కొట్టించుకున్నారు. అటు చిత్రాడ సభ కనివినీ ఎరుగని రీతిలో సక్సెస్ అయింది. అంచనాలకు మించి జనం భారీగా తరలి రావడంతో సభా ప్రాంగణం మధ్యాహ్నానికే కిక్కిరిసింది. రాష్ట్రవ్యాప్తంగా దారులన్నీ చిత్రాడవైపే కదలడంతో కత్తిపూడి నుంచి కాకినాడ వరకు 216హైవే ఇసుకేస్తే రాలనంతగా మారిపోయింది.మహిళలు.యువత..రైతులు.. ఇలా అన్ని వర్గాలు సభకు హాజరవడం కన్నులపండువగా కనిపించింది. అటు పవన్ టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి ఇప్పటివరకు డిప్యూటీ సీఎంగాను,పంచాయతీరాజ్, అటవీశాఖ మంత్రిగా సాధించిన విజయాలను ప్రత్యేక వీడియో ద్వారా ప్రదర్శించడం అందరినీ ఆకట్టుకుంది.పవన్ కోసం జనం ఉదయం నుంచే సభా ప్రాంగణానికి చేరుకున్నారు. దీంతో మూడు ప్రవేశద్వారాలు కిక్కిరిసిపోయాయి. అటు పోలీసులేమో మధ్యాహ్నం 12గంటల నుంచే లోపలకు అనుమతించడంతో జనం ఆరుబయటే ఎండలో ఉండిపోయారు.ఆ తర్వాత మధ్యాహ్నం మూడు



విజయకేతనమే..



పవనే..మా నాయకుడు

గంటలకే సభలోని అన్ని గ్యాలరీలు నిండిపోయాయి. దీంతో వేలాది జనం బయటే ఉండిపోయారు. చాలా మంది వద్ద వీవీఐపీ, వలంటీర్ల పాసులు ఉన్నా పోలీసులు లోపలకు పంపకపోవడంతో చాలాసేపు వాగ్వాదం జరిగింది. అటు ఎండ తీవ్రత చాలా ఎక్కువగా ఉండడంతో కొందరు మహిళలు సొమ్మసిల్లిపడిపోయారు. కానీ అంచనాలకు మించి తరలివచ్చిన జనం ఎక్కడా ఎండకు భయపడకుండా రాత్రి పదిన్నర వరకు సభలోనే ఉండిపోయారు.

4:30 గంటలకు పవన్..

పవన్‌కల్యాణ్ సరిగ్గా 4.30గంటలకు సభా ప్రాంగణానికి హెలికాప్టర్‌లో చేరుకున్నారు. అనంతరం సభా వేదిక పక్కనే ఉన్న ప్రత్యేక బసలోకి వెళ్లి తిరిగి స్టేజీ మీదకు రాత్రి 7.30 గంటలకు చేరుకున్నారు. ఈలోపు చాలాసేపు మంత్రి నాదెండ్లతో భేటీ అయ్యారు. అటు పవన్ వచ్చిన హెలికాప్టర్ సాయంత్రం ఐదుగంటలకు కాకినాడ వెళ్లింది. సభ ముగిసిన తర్వాత పవన్ కాకినాడలో జేఎన్టీయూ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. తిరిగి శనివారం ఉదయం పవన్ హెలికాప్టర్‌లో అమరావతికి బయలుదేరనున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి సభలో జనసేన ఎంపీ ఉదయ శ్రీనివాస్, మంత్రి దుర్గేష్, పలువురు ఎమ్మెల్యేలు ప్రసంగించారు. పవన్ తన ప్రసంగంలో ఎక్కడా పిఠాపురం నియోజవకర్గం గురించి ప్రత్యేకంగా ప్రస్తావన తేలేదు.అనేక విస్తృత అంశాలపై అనర్గళంగా ప్రసంగించడంతో సభకు వచ్చిన వారంతా చప్పట్లతో పవన్‌ను అభినందించారు. పవన్ సైతం సభను సక్సెస్ చేయడానికి శ్రమించి, సహకరించిన కాకినాడ కలెక్టర్,ఎస్పీతోపాటు పోలీసులను అభినందించారు.సినిమాలనుంచి తన రాజకీయ ప్రస్థానం వరకు కూలంకషంగా చర్చించడం అభిమానులను అలరించింది. జనసేనకు అధికారం ఇవ్వడం వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతున్న విషయాన్ని వివరించి అందరినీ ఆకట్టుకున్నారు. ప్రసంగం మధ్యలో పవన్ అని జనం అరుస్తుండడంతో.. కొంత అసహనం చెందిన పవన్ నా పేరు అరుస్తున్నారు.. అంటే.. నా ప్రసంగం వినడం లేదని అర్థం అని చురకలు అంటించడంతో జనసైనికులు ప్రసంగంపై దృష్టిసారించారు. జగన్‌లా తాను కోడికత్తి రాజకీయాలు చేయడం లేదని సైద్ధాంతిక రాజకీయాలు చేస్తున్నాని గుర్తుచేశారు.పదేళ్లలో పడ్డాం..నిలబడ్డాం అని పేర్కొని జనసేన ప్రస్థానాన్ని గుర్తుచేశారు. రానున్న రోజుల్లో యువ నాయకులను తయారు చేయడమే లక్ష్యంగా జనసేన ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. సభ ముగిసిన తర్వాత జనం తిరిగి స్వస్థలాలకు తిరిగి వెళ్లే సమయంలో వారందరికీ భోజన వసతిని పార్టీ సమకూర్చింది.అంచనాలకు మించి వచ్చిన జనానికి ఎక్కడా భోజనాలకు ఇబ్బంది లేకుండా ఆతిథ్యం వహ్ వా అనేలా చేసింది. అటు రాష్ట్రస్థాయి సభ చిత్రాడలో జరుగుతుండడంతో ఊరి గురించి ప్రతి ఒక్కరూ ఆరా తీయడంతో గూగుల్‌లో ట్రెండింగ్‌గా మారింది. హోటళ్లు, రెస్టారెంట్లు భారీగా కిక్కిరిశాయి.





ఏ తరమైనా..అభిమానమే..



అభిమాన హారతి..

మా గురుతు.. పవన్..





అదిరే ఆతిథ్యం : కాకినాడ నుంచి చిత్రాడ వరకూ పలు చోట్ల ఆహార కేంద్రాలు ఏర్పాటు చేసి మధ్యాహ్నం.. సాయంత్రం కూడా బిరియానీ.. భోజనాలు అందించారు.



జై..జై.. జనసేన

నేటి నుంచి ఒంటిపూట బడులు

రాజమహేంద్రవరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఒంటిపూట బడులు శనివారం నుంచి నిర్వహిస్తున్నామని డీఈవో కె.వాసుదేవరావు పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షా కేంద్రాలు ఉన్న పాఠశాలల్లో మధ్యాహ్నం 1:15 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ, మిగతా పాఠశాలల్లో ఉదయం 7:45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ తరగతులు నిర్వహిస్తారన్నారు. ఏప్రిల్ 23వ తేదీ వరకూ పాఠశాలలు ఉంటాయన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకూ ఇది వర్తిస్తుందని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలు ఉల్లంఘించి తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.



హోలీ.. రంగోళి

రాజమహేంద్రవరంలో శుక్రవారం హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు.. ఒక రికొకరు రంగులు పూసుకుంటూ ఆనందంగా గడిపారు.. రాజమహేంద్రవరం కార్పొరేషన్ కమిషనర్ కేతన్‌గార్గ్ ఉద్యోగుల మధ్య హోలీ పండుగ జరుపుకున్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు నగరంలో పలు చోట్ల రంగులు పూస్తూ సందడి చేశారు. - 8లో

నగరంలో రెచ్చిపోతున్న ఆవారాగాళ్లు

- ఇద్దరు విద్యార్థులపై దాడి
- తరిమి..తరిమి కొట్టిన వైనం
- స్థానికులు రావడంతో పరార్

రాజమహేంద్రవరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రశాంతమైన రాజమహేంద్రవరంలో ఆవారాగాళ్లు రెచ్చిపోతున్నారు.మద్యం, గంజాయి మైకంలో సాధారణ జన జీవనాన్ని బెంబేలెత్తిస్తున్నారు.దీనికి శుక్రవారం విద్యార్థులపై జరిగిన దాడిఘటనే ఉదాహరణ. ఒక ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న ఆశ్రిత్,శ్రీరామ్ ప్లెజర్ ద్విచక్ర వాహనంపై కళాశాల నుంచి సాయంత్రం నారాయణపురంలోని వాళ్ల ఇంటికి బయలుదేరారు. ఎఫ్‌సీఐ గోదాముల పక్క రోడ్డు సైక్లోన్ కాలనీ చివరలో ఉన్న పార్కు సమీపంలో ఇద్దరు యువకులు పూటుగా తాగేసి నలుగురు పిల్లల చెప్పులు తీసుకుని ఏడిపిస్తున్నారు.ఈ విషయం అటుగా వస్తున్న విద్యార్థులకు చెబుదామని నలుగురు పిల్లలు ఆపారు.ఈలోపు ఆ ఇద్దరు యువకులు వచ్చి విద్యార్థులపై దాడి చేసి కొట్టడం ఆరంభించారు. విద్యార్థులు ప్రాణభయంతో ద్విచక్ర వాహనంపై వేగంగా వెళుతుండగా వెనుక వస్తూ కొడుతూనే ఉన్నారు. సెంట్రల్ జైలు సమీపంలో విద్యార్థులు వెళుతున్న వాహనాన్ని గట్టిగా కాలితో తన్నారు.ఆర్ట్స్ కళాశాల జంక్షన్ వద్ద అటకాయించి మళ్లీ కొట్టడం మొదలు పెట్టారు.దీంతో ఇద్దరు విద్యార్థులు గాయాలపాలయ్యారు..ద్విచక్ర వాహనం తాళం కూడా లాక్కున్నారు. స్థానికులు ప్రశ్నించడంతో ఆ ఇద్దరు యువకులు విద్యార్థుల ద్విచక్రవాహన తాళం పట్టుకుని పరార య్యారు.సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా యువకులను పోలీసులు గుర్తించి కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని స్థానికులు కోరారు.



గాయాలపాలైన విద్యార్థులు

కుటుంబ సమస్యలు.. పంచ ప్రాణాలు బలి!

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రెండు విషాదకర ఘటనలు చోటు చేసుకున్నాయి.. కుటుంబ సమస్యలకు పంచ ప్రాణాలను ఫణంగా పెట్టారు.. కాకినాడ జిల్లా తూరంగికి చెందిన దంపతులు ఆర్థిక ఇబ్బందులు తాళలేక రాజమహేంద్రవరంలో గోదావరిలో దూకి ప్రాణాలు తీసుకోగా.. కాకినాడలో జరిగిన మరో ఘటనలో కన్నతండ్రే మరీ కర్కశంగా ఇద్దరు పిల్లలను చంపేసి.. తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. - 7లో

వేగం..విషాదం

తాడేపల్లిగూడెంలో లారీని ఢీకొన్న కారు

కుమార్తె సహా తల్లిదండ్రుల దుర్మరణం.. మరొకరికి గాయాలు.. మృతులది మండపేట

7

జనషోన



సభ వద్ద నాగబాబు భార్య



సభకు కదలివచ్చిన అశేష ప్రజానీకం..అభివాదం చేస్తున్న పవన్

పవన్ అభిమానం



మేం సైతం : సభకు కదలివచ్చిన దివ్యాంగులు

పవనుడు అందరివాడు..



పిఠాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పవన్ సభకు ఎక్కడెక్కడి నుంచో అభిమానులు తరలివస్తారు. దానికి తగినట్టు ఏర్పాట్లు కూడా చేశారు. ఇతర రాష్ట్రాల నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానుల కోసం ఆయా భాషల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. జయకేతనం అంటూ తమిళం, కన్నడ, హిందీ తదితర భాషల్లో ఏర్పాటు చేసిన బోర్డులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సభ వద్ద కర్నాటక రాష్ట్రానికి చెందిన జన సైనికులు కన్నడ భాషలో రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు.

పచ్చని స్వాగతం..



పర్యావరణ ప్రాధాన్యతను వివరిస్తూ కాకినాడ సర్పవరం జంక్షన్ నుంచి చిత్రాడ వరకూ పచ్చని స్వాగతద్వారాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని వర్గాలకు మేలు చేసే పలు కార్యక్రమాలు నిర్వహించిన విశిష్ట వ్యక్తులు పిఠాపురం మహారాజా సూర్యారావు బహదూర్, మల్లాడి సత్యలింగ నాయకర్, డొక్కా సీతమ్మ పేర్లను స్వాగత ద్వారాలకు పెట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

9 చోట్లా ఇంతే

చిత్రాడలో నిర్వహించిన జయకేతనం సభకు సంబంధించి 9 ప్రాంతాల్లో పార్కింగ్ ప్రదేశాలు కేటాయించారు. ప్రతి చోటా వాహనాలన్నీ ఇలా బారులుతీరాయి. బస్‌లు, కార్లు, ద్విచక్రవాహనాలతో ఎక్కడికక్కడ నిండిపోయాయి.



జయకేతనం.. విజయకేతనమే.. యువత ఉప్పొంగింది.. చిత్రాడను ముంచెత్తింది.. ఎటు చూసినా ఎక్కడ చూసినా జనమే జనం.. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ వీధులన్నీ జనంతో నిండిపోయాయి.. జై పవన్.. జై జై పవన్ నినాదాలతో మార్మోగిపోయాయి.. డిప్యూటీ సీఎం.. పిఠాపురం ఎమ్మెల్యేగారి తాలూకా బైక్‌లతో నిండిపోయాయి.. కార్లు.. ఆటోలు.. బస్‌లు క్యూకట్టాయి.. రకరకాల విన్యాసాలు చేసుకుంటూ జనసైన్యం కదిలింది.. పవన్‌పై అభిమానం చాటింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే జనసైనికులు తరలిరావడం ఆరంభించారు.. ఆలస్యంగా వెళితే అన్నను వెనుక నుంచి చూడాలని ముందుగానే జయకేతనం సభ నిర్వహించే చిత్రాడకు చేరుకున్నారు.. లక్షలాది మందితో గ్రామం కిక్కిరిసిపోయింది..

మొక్కు తీరుద్దామని..



పిఠాపురం : 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ విజయం సాధిస్తే వైజాగ్‌లోని కనకమహాలక్ష్మి.. తిరుమల వెంకటేశ్వరస్వామి.. హైదరాబాద్‌లోని పెద్దమ్మతల్లి గుడికి వస్తానని అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన జనసైనికుడు గుత్తుర్తి విజయబాబు మొక్కుకున్నాడు. సైకిల్‌పై మొక్కు తీర్చుకునేందుకు తిరుపతికి బయలుదేరి చిత్రాడలో జరుగుతున్న జనసేన సభ వద్దకు వచ్చారు. సభ చూసిన తర్వాత తిరుమలకు సైకిల్‌పై వెళతానని విజయబాబు తెలిపారు.



చిత్రాడదారులన్నీ జనపవనమై..

జనసైనికా.. కూల్..కూల్..



పిఠాపురం,/కాకినాడ కలెక్టరేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రండి బాబు రండి పుచ్చకాయలు తిని వెళ్లండి.. లేదంటే మజ్జిగ తాగి వెళ్లండి.. ఏదైనా మీ చాయిస్ అంటూ దారి పొడవునా జనసైనికులను చల్లబరిచారు.. చిత్రాడ జనసేన ఆవిర్భావ సభకు అటు, ఇటూ పది కిలోమీటర్ల దూరం వరకూ ఎక్కడికక్కడ ఏర్పాటు చేసిన ఉచిత కౌంటర్ల ద్వారా ఉదయం నుంచి రాత్రి వరకూ పిలిచి మరీ అందించారు. మజ్జిగ ప్యాకెట్లతో పాటు వాటర్ ప్యాకెట్లు భారీ ఎత్తున పంపిణీ చేశారు.



వీరమహిళల ఆనందోత్సాహం



మైక్ స్టాండ్‌లపైనా జనసైన్యం



జనసేన సభ ఎక్కడుంటే అక్కడే ఉంటా



హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ రాములును సత్కరిస్తున్న పవన్‌కల్యాణ్



తిరుగు ప్రయాణంలో..



స్వాగత ద్వారం వద్ద 108 కొబ్బరికాయలు కొడుతున్న జన సైనికులు

సభ విజయవంతం కావాలని 108 కొబ్బరికాయలు కొట్టారు!

పిఠాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ సభకు వచ్చిన జన సైనికులు కొబ్బరికాయలు కొట్టారు. కోనసీమ ప్రాంతం నుంచి వచ్చిన ఈ జన సైనికులు సభ సమీపంలో ఏర్పాటు చేసిన డొక్కా సీతమ్మ స్వాగత ద్వారం వద్ద 108 కొబ్బరికాయలు కొట్టి జనసేన ఆవిర్భావ సభ విజయవంతంగా సాగాలని కోరుకున్నారు.



జనశ్రేణులకు ఎండదెబ్బ

పిఠాపురం/కలెక్టరేట్ (కాకినాడ) మార్చి 14(ఆంధ్రజ్యోతి): జన సైనికులను ఎండ తీవ్రత ఇబ్బందులకు గురిచేసింది. శుక్రవారం ఉదయం నుంచి ఎండతీవ్రత గణనీయంగా ఉంది. మధ్యాహ్నానికి గరిష్ట ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలుగా నమోదైంది. చిత్రాడ శివారులోని జనసేన ఆవిర్భావ సభా ప్రాంగణానికి మధ్యాహ్నం 12 గంటలకే చేరుకున్న వారికి ఎండతీవ్రత చుక్కలు చూపించింది. సభా ప్రాంగణంలోకి వచ్చిన జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు ఎండ నుంచి కాపాడుకునేందుకు అట్టలు, పేపర్లు అడ్డుగా ఉంచుకున్నారు. పలువురు ఫ్లెక్సీలను నెత్తిన పెట్టుకుని ఎండ తీవ్రత నుంచి కాపాడుకునే ప్రయత్నం చేశారు. చెట్ల కింద కూర్చుని ఉపశమనం పొందారు. సాయంత్రం వరకూ ఇదే రీతిలో ఉష్ణోగ్రతలు కొనసాగాయి. దీంతో సభకు వచ్చినవారు తాగునీరు,మజ్జిగ తాగుతూ తీవ్రత తగ్గించుకునే ప్రయత్నం చేశారు.



అస్వస్థతకు గురైన వలంటీర్ కె.దుర్గాలక్ష్మి

పదిమందికి పైగా అస్వస్థత

పిఠాపురం/పిఠాపురం రూరల్/గొల్లప్రోలు రూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ సభలో అపశృతి చోటు చేసుకుంది. సభకు వచ్చిన పలువురు ఎండతీవ్రత, ఉక్కపోత భరించలేక అస్వస్థతకు గురయ్యారు. తీవ్రమైన ఉక్కపోత ఉండడంతో ఒకరిద్దరు స్పృహ కోల్పోయారు. సభలో వలంటీర్‌గా పనిచేసేందుకు వచ్చిన తెనాలికి చెందిన కె.దుర్గాలక్ష్మి, బందోబస్తు విధుల నిమిత్తం వచ్చిన రాజమహేంద్రవరం కానిస్టేబుల్ కె.దేవి, సత్యవతి, ఎం.రాధాకృష్ణ సహా పదిమంది అస్వస్థతకు గురయ్యారు. వీరిని తొలుత పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రి, ప్రైవేటు ఆస్పత్రులకు మెరుగైన చికిత్స నిమిత్తం తరలించారు.

ముఖ్య నేతలు ఎవరేమన్నారంటే...

- కలెక్టరేట్ (కాకినాడ)

విప్పటం సభలో వేటకు వెళుతున్న సింహంలా..

విప్పటంలో జరిగిన సభలో వేటకు వెళుతున్న సింహంలా పవన్‌కల్యాణ్ కన్పించారు. ఈ 12వ ఆవిర్భావ సభకు వస్తుంటే గుంటనక్కలను వేటాడి వచ్చిన సింహంలా పవన్ కనిపిస్తున్నారు. పవన్‌కల్యాణ్ కృషి వల్లే ఈరోజు రాష్ట్రంలో జలజీవన్ మిషన్ కింద నిధులు విడుదల అవుతున్నాయి. గత పాలకులు కేంద్ర ప్రభుత్వానికి చెందిన జలజీవన్ మిషన్ నిధులు నిర్వీర్యం చేశారు. - **కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్**

మోదీ అంత క్రేజ్ పవన్‌ది..

2019 సార్వత్రిక ఎన్నికల్లో అందరూ ఓడిపోయినా ఢీలా పడలేదు. తర్వాత 2024 సార్వత్రిక ఎన్నికల్లో 100 శాతం స్ట్రైకరేట్‌తో విజయం సాధించాం. దేశంలో నరేంద్రమోదీ తర్వాత అంతటి క్రేజ్ పవన్‌కు ఉంది.

- కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ

సొంత డబ్బు కౌలు రైతులకు ఇచ్చారు

పవన్ సొంత డబ్బు పంపిణీ చేసి కౌలు రైతులను ఎంతో ఆదుకున్నారు. జనవాణిలో వచ్చే దరఖాస్తులను పరిష్కరిస్తున్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ పరిష్కరించి వారి మనస్సులో నిలుస్తున్నారు. మూడు పార్టీలు కూటమిగా ఏర్పడడానికి పవన్ ఎంతో శ్రమించారు. మత్స్యకారులకు నష్టం కల్గించే జీవో రద్దు చేశారు.

- తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

మత్స్యకారులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మత్స్యకారులకు నష్టం కల్గించే 217 జీవోను పవన్‌కల్యాణ్ రద్దు చేయించారు. ఎన్నికల్లో మత్స్యకారులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు.

- నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్

గిరిజనుల అభివృద్ధికి కోసం కృషి

అప్పట్లో బ్రిటీష్ వాళ్లకు వ్యతిరేకంగా అల్లూరి సీతారామరాజు ఎన్నో పోరాటాలు చేశారు. ఇప్పుడు గిరిజనుల అభివృద్ధి కోసం పవన్‌కల్యాణ్ ఎంతో కృషి చేస్తున్నారు. మన్యం జిల్లాలో రోడ్ల అభివృద్ధికి పవన్ కృషి చేస్తున్నారు. జనసేన అధ్యక్షుడు పవన్ గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

- పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ

గత ప్రభుత్వంలో ఎన్నో అవమానాలు భరించాం

గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో అవమానాలు భరించాం. అయినప్పటికీ అధైర్యపడకుండా పనిచేసి పవన్ సారధ్యంలో విజయం సాధించాం. మన కర్తవ్యం స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనే.

- నెల్లిమర్ల ఎమ్మెల్యే మాధవి

పవన్‌కల్యాణ్ కారణజన్ముడు

పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ కారణజన్ముడు. అందుకే తను పుట్టినప్పుడు తన మాతృమూర్తికి నొప్పులు లేవు. పవన్ స్వార్థం లేకుండా రాజకీయాలు చేశారు. ఆదాయం వచ్చే సినిమాలు వదిలేసి ప్రజల కోసం పోరాటాలు చేసి ప్రజల కోసమే అధికారంలోకి వచ్చారు.

- అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

పవన్ పోరాటంతోనే ఎన్నికల్లో నెగ్గాం

కేవలం ఒక వ్యక్తి పవన్ పోరాటంతోనే సార్వత్రిక ఎన్నికల్లో అందరూ నెగ్గాం. పవన్ కల్యాణ్ పోరాటాల వల్ల అధికారంలోకి వచ్చాం. తొమ్మిది నెలల్లో అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించాం.

- పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

నేను పిఠాపురం ఎమ్మెల్యే తాలూకా

తాను పిఠాపురం ఎమ్మెల్యే తాలూకానని అనగానే సభలో నవ్వులు విరిశాయి. దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్ ఆదర్శంతో జనసేన పార్టీ ఆవిర్భయించింది. వందేళ్ల క్రితం అల్లూరు సీతారామరాజు బ్రిటిష్ దొరలను గడగడలాడించారు. మరళా ఇప్పుడు పవన్ వైసీపీ నియంతలను గడగడలాడించారు. జగన్‌రెడ్డి మీకు ఇంకా జనసేన ఎందుకు పుట్టిందో అర్థంకాలేదా అని ప్రశ్నించారు.

- యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

పవన్‌తోనే సాధ్యం

పవన్ సారధ్యంతోనే జనసేన అఖండ విజయం సాధించింది. గత ప్రభుత్వంపై ఎన్నో పోరాటాలు చేశాం. చివరకు కూటమిగా జతకట్టి విజయం సాధించాం. పేదలకు సేవ చేయడానికే పవన్ పార్టీ పెట్టారు.

- రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్

జగన్ తెలుగుకు ఎక్కువ.. ఇంగ్లీషుకు తక్కువ

వైసీపీ నేత జగన్ తెలుగుకు ఎక్కువ, ఇంగ్లీషుకు తక్కువ. పవన్‌కల్యాణ్‌కు నాలుగైదు భాషలు మాట్లాడతారు. జగన్‌కు కనీసం తెలుగు, ఇంగ్లీషులో కూడా పరిజ్ఞానం లేదు. జగన్ చేసిన అహంకారపూరిత వ్యాఖ్యల వల్లే ఆ పార్టీ కేవలం 11 సీట్లుకే పరిమితం అయ్యింది. - **మచిలీపట్నం ఎంపీ బాలశౌరి**

భవిష్యత్తులో వైసీపీ కనుమరుగు

గత 11 ఏళ్ల పవన్‌కల్యాణ్ సారథ్యంలో ఆవిర్భావ సభలు జరుపుకున్నాం. ఇప్పుడు పెద్దసంఖ్యలో పార్టీ నాయకులు అభిమానుల మధ్య జరుపుకోవడం సంతోషంగా ఉంది. భవిష్యత్తులో వైసీపీ కనుమరుగవడం ఖాయం.

- కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి

అడుగులన్నీ అటువైపే..

ఆవిర్భావ వేడుకకు తరలివచ్చిన జనసైన్యం

కాకినాడ- పిఠాపురం రహదారిపై భారీ జనసందోహం.. జనసైన్యాన్ని అదుపు చేయలేక పోలీసుల కష్టాలు

పిఠాపురం/ కాకినాడ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): అన్నిదారులు ఆవిర్భావ సభ వైపే. చిత్రాడకు వచ్చే మార్గాలన్నీ జనసంద్రమయ్యాయి. శుక్రవారం మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకూ 216వ జాతీయ రహదారితోపాటు అన్ని రోడ్లు ప్రజలు, వాహనాలతో కిక్కిరిసిపోయాయి. పార్కింగ్ ప్రదేశాలు మధ్యాహ్నం 3 గంటలకే నిండిపోవడంతో ఎక్కడికక్కడ రహదారుల వెంబడి వాహనాలు నిలిపివేశారు. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. సభ ముగిసిన తర్వాత ఇదే పరిస్థితి నెలకొంది. ఎన్‌హెచ్‌తోపాటు పిఠాపురం-సామర్లకోట, ఉప్పాడ-పిఠాపురం, విరవాడ-కోలంక-పిఠాపురం, గోర్స-పిఠాపురం, తిమ్మాపురం-పిఠాపురం, చంద్రపాలెం-చిత్రాడ, నాగులాపల్లి-మాధవపురం-పిఠాపురం సహా అన్ని రోడ్లు వాహనాలతో కిక్కిరిసి కనిపించాయి. చిత్రాడ సభా ప్రాంగణానికి సమీపంలో కాకినాడ వైపు ఏర్పాటు చేసిన అయిదు, పిఠాపురం వైపు ఏర్పాటుచేసిన నాలుగు పార్కింగ్ ప్రదేశాలు మధ్యాహ్నం 3గంటలకే నిండిపోయాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బస్సులు, కార్లు, వేన్‌లు, ఇతర వాహనాలకు నిలిపే చోట్లు లేకపోవడంతో జాతీయరహదారి, చిత్రాడ పరిసర ప్రాంతాల్లోని రోడ్లపై నిలిపివేశారు. ట్రాఫిక్ సైతం కిలోమీటర్ల మేర నిలిచిపోయింది.



జ్యోతి ప్రజ్వలన

మామిడికుదురులో ఓఎన్జీసీ పైపులైను లీకేజీ


లీకవుతున్న గ్యాస్ పైపులైను

మామిడికుదురు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పాశర్లపూడి ఓఎన్జీసీ స్ట్రక్చర్‌లో గల పైపులైను మామిడికుదురులో గురువారం స్వల్పంగా లీకైంది. గ్రామంలోని ఏటిగట్టు శివారు ప్రాంతంలో గల వరి చేలలో లీకేజీ ఏర్పడింది. పాశర్లపూడి 43 బావి నుంచి నగరం జీసీఎస్ వరకు ఏర్పాటుచేసిన పైపులైను నుంచి లీకేజీ ఏర్పడినట్టు సంబంధిత అధికారులు గుర్తించారు. లీకేజీ ఏర్పడిన ప్రాంతంలో తెల్ల నురగతో పాటు ముడిచమురు తెట్టుగా రావడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లీకేజీ ఏర్పడిన ప్రాంతంలో ముడిచమురు వాసన వ్యాపించడంతో స్థానికులు ఆందోళన చేస్తున్నారు. గతంలో కూడా ఇదే ప్రాంతంలో రెండు పర్యాయాలు లీకేజీ సంభవించిందని అధికారులు తూతూ మంత్రంగా లీకేజీ అరికట్టి చేతులు దులుపుకుంటున్నారని సంబంధిత రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో లీకేజీ కాకుండా చర్యలు చేపట్టాలని స్థానికులతో పాటు రైతులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో గర్భిణి మృతి


ధనకుమారి (ఫైల్)

ముమ్మిడివరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం కర్రివానిరేవు పంచాయతీ చింతావానిరేవులో శుక్రవారం ఓ మహిళ విద్యుదాఘాతంతో మృతిచెందింది. చింతావానిరేవుకు చెందిన రేకాడి ధనకుమారి (25) వాటర్ హీటర్‌ను స్విచ్ బోర్డులో పెట్టే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. ఆమె భర్త రేకాడి కనకరాజు కర్రివానిరేవు గ్రామ పంచాయతీ పరిధి 10వ వార్డు సభ్యుడు. ఒక కుమార్తె ఉండగా ప్రస్తుతం ఆమె మూడు నెలల గర్భిణి. ధనకుమారి భర్త కనకరాజు చేపలవేట వృత్తి చేసుకుంటున్నాడు. ధనకుమారి మృతితో ఆకుటుంబంలో విషాదం నెలకొంది.

ఇద్దరు నకిలీ విలేకర్లపై కేసు

మండపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): విలేకర్ల ముసుగులో బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడిన ఇద్దరిపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణ పోలీసులు గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. పట్టణ సీఐ దారం సురేష్ తెలిపిన వివరాల ప్రకారం... అనపర్తి మండలం మహేంద్రవాడకు చెందిన చంద్రమళ్ల రవీంద్ర కోళ్లపెంటను వాహనంలో తీసుకువెళుతుండగా మండపేట ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు వచ్చేసరికి తాము విలేకర్ల మంటూ మండపేటకు చెందిన పెనుముచ్చి సుకుమార్, రాయవరం మండలానికి చెందిన పెంకే వంశీ వ్యాన్‌ను ఆపారు. లారీ రికార్డును తీసుకురావాలని కోరారు. వ్యాన్ కదలాలంటే తమకు రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నగదు ఇచ్చేందుకు రవీంద్ర నసేమి రా అననంతో స్టేషన్‌కు పదాఅంటూ వ్యాన్‌ను మండపేట పట్టణ పోలీసుస్టేషన్ వద్దకు తీసుకొచ్చారు. స్టేషన్‌కు వచ్చిన తర్వాత జరిగిన సంఘటన అంతా డ్రైవర్ రవీంద్ర పట్టణ సీఐ సురేష్‌కు వివరించారు. దానిపై సీఐ నకిలీ విలేకర్లను వాహనం ఎందుకు ఆపారు అంటూ ప్రశ్నించారు. దానికి వారు నీళ్ల నమిలారు. డ్రైవర్ ఫిర్యాదుపై సుకుమార్, వంశీలపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. ఎవరైనా విలేకర్ల ముసుగులో నకిలీ దందాలు చేస్తే ఫిర్యాదు చేయాలని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ స్పష్టం చేశారు.

శాస్త్రోక్తంగా నారసింహుని చక్రస్నానం

- కోరుకొండలో ప్రత్యేక పూజలు
- పోటెత్తిన భక్తులు


చక్రస్నానం దృశ్యం

కోరుకొండ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదోరోజు శుక్రవారం పౌర్ణమి సందర్భంగా స్వామి వారి కోనేరు వద్ద చక్రస్నానం ఆగమ పండితులు, అర్చక స్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకుముందు అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, కోరుకొండ దేవస్థానం ఛైర్మన్ పరాసర రంగరాజ భట్టర్ స్వామి ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి దిగువ దేవస్థానం వద్ద స్వామికి సేవాకాలం నిర్వహించారు. అనంతరం అనంత పద్మనాభ స్వామివారిని, శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని వేర్వేరు పల్లకీలలో ఆశీనులు గావి ంచారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చరణల మధ్య పల్లకీలు దిగువ దేవస్థానం నుంచి గిరి ప్రదక్షిణగా దేవుని కోనేరు వద్దకు చేరుకున్నాయి. అక్కడ శ్రీ లక్ష్మీనరసింహస్వామివారు, శ్రీభూ సమేత అనంత పద్మనాభస్వామి వారి సమక్షంలో ఆగమ బ్రహ్మపాణింగపల్లి పవన్ కుమార్ ఆచార్య లు, అనువంశక అర్చక స్వాములు పెదపాటి గిరిధరాచార్యులు, సంతోషకుమార్ ఆచార్యులు ఈ చక్ర పెరుమాళ్ళకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అంతకుముందు విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచన కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తదుపరి శ్రీ చక్రపెరుమాళ్ళకు పంచామృత అభిషేకాలు చేసి దేవుని కోనేటిలో చక్రస్నానం చేయించారు. అనేక మంది పండితులు, ఆలయ అధికారులు, అర్చక స్వాములు వందలాది మంది భక్తులు, స్వామివారితో కలిసి దేవుని కోనేటి చక్రస్నానం చేశారు. అనంతరం స్వామి వారికి అర్చన, సేవాకాలం, తీర్థగోష్టి జరిగింది. తదుపరి భక్తుల గోవిందనామస్మరణ మధ్య శ్రీ లక్ష్మీనరసింహస్వామివారు అనంతపద్మనాభ స్వామివారు శ్రీచక్రపెరుమాళ్ళతో దేవాలయానికి చేరుకున్నారు.

శేషవాహనంపై గ్రామోత్సవం

అలాగే విశేష పుష్ప అలంకరణలతో స్వామి,అమ్మవార్లను శేషవాహనంపై ఆశీనులైరాత్రి 9గంటలకు గ్రామోత్సవం చేశా రు. వేద పండితుల మంత్రోచ్చరణలు, మేళతాళాలు, మంగళవాయిద్యాలు నడుమ స్వామివారి శేషవాహనాన్ని కోరుకొండ నాలుగు మాడవీధుల్లో తిప్పారు. ఆ వాహనం తమ ఇళ్ల ముందుకు వచ్చినప్పుడు భక్తులు స్వామివారికి ఫలాలు, పుష్పాలు మంగళనీరాజనాలు అందజేశారు. ఉత్సవాలు ముగింపు రోజు చివరి రోజు శేషవాహనాన్ని తిలకించి పులకించారు.

ముగిసిన పండిత సభలు

శ్రీ రంగరాజ స్వామి వారి ఆలయ సన్నిధిలో గత 5 రోజులుగా సాగుతున్న 93వ విశిష్టాద్వైత పండిత సభలు శుక్రవారం రాత్రి 8గంటలతో వైభవంగా ముగిశాయి. సభా అధ్యక్షులు పరా సర లక్ష్మీనరసింహ భట్టర్ ఆధ్వర్యంలో ఉభయ వేదాంత పండితులు సాతులూరి వెంకట శ్రీనివాస్ కల్యాణ చక్రవర్తి, మార్గపూరి రంగాచార్య స్వాములు ఉపన్యసించారు. అనేక భగవద్ విషయాలను భక్తులకు వివరించారు. అదే విధంగా నరసింహస్వామివారి అనువంశకధర్మకర్త పరాసర రంగరాజ భట్టర్ స్వామి, రఘునాథ భట్టర్ స్వామి, మహిళా పండితులు ఉభయ వేదాంత పండిత సభల్లో పలు విషయాలను వివరించారు. పరాసర లక్ష్మీనరసింహభట్టర్ ఆధ్వర్యంలో పండితులకు సత్కారం జరిగింది.


స్వామివారి అద్దపు సేవ దృశ్యం


పండిత సభలో పాల్గొన్న లక్ష్మీ నరసింహభట్టర్, పండితులు

వైభవంగా అద్దపు సేవ

నరసింహస్వామి దివ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా చివరి రోజు శుక్రవారం పౌర్ణమి పర్వదినం సందర్భంగా స్వామి వారి కల్యాణ వేదికపై స్వామివారికి విశేష ఫలపుష్ప అలంకరణల మధ్య అద్దపు సేవ అనబడే ఊంజలసేవ నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదికపై ఊయలలో ఆశీనులు గావించి ఈ సేవ చేపట్టారు. స్వామికి ఎదురుగా ఉన్న పెద్ద అద్దంలో వేలాదిమంది భక్తులు అద్దంలో దర్శించుకున్నారు. అంతకుముందు ధ్వజ అవరోహణ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో పరాసర లక్ష్మీనరసింహభట్టర్, రంగరాజ భట్టర్, అన్నవరం దేవస్థానం డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్, సూపరింటిండెంట్ వాసు, రాంజీ, నాగరాజు, ఇతర అధికారులు, పెద్దింటి చంటిబాబు ఆచార్యులు, వాడపల్లి నాగు ఆచార్యులు, పెదపాటి గిరిధరాచార్యులు, గోవర్ధనం తిరుమలాచార్యులు, పెరవళి వంశీఆచార్యులు, గ్రామ సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ వీరగణేష్, బీజేపీ ఇన్‌చార్జ్ నీరుకొండ వీరన్న చౌదరి పాల్గొన్నారు.

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి పూజలు


అన్నవరంలో జస్టిస్ శ్రవణ్‌కుమార్‌కు సత్యదేవుని మెమెంటో అందజేస్తున్న పీఆర్వో

అన్నవరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రవణ్‌కుమార్ కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

భీమేశ్వరాలయంలో...

ద్రాక్షారామ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని శుక్రవారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రవణ్‌కుమార్ సతీసమేతంగా దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. దర్శన అనంతరం వారికి వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు.

నేడు ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య, బడ్జెట్ సమావేశాలు

కాకినాడ సిటీ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సాధారణ, బడ్జెట్ సమావేశాలు శనివారం జరగనున్నాయి. కాకినాడలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో ప్రజాప్రతినిధులు, జడ్పీటీసీలు, మూడు జిల్లాల అధికారులు పాల్గొంటారు.

కన్న తండ్రే కాలయముడై..

ఇద్దరు కుమారుల్ని క్రూరంగా చంపి ఆపై ఆత్మహత్యకు పాల్పడిన నాన్న

- కుప్పకూలిన తల్లి
- సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్న పోలీసులు
- హోలీ రోజున కాకినాడలో దారుణం


ఫ్యానుకి ఉరేసుకున్న చంద్రకిషోర్


ఫైల్ ఫొటో

సర్పవరం జంక్షన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలంతా హోలీ వేడుకల్లో ఆనందోత్సాహాల్లో మునిగి ఉన్నారు. ఇద్దరూ చిన్నారులు కూడా హోలీ పండుగలో తల్లిదండ్రులతో కలిసి పాల్గొనేందుకు వెళ్తున్నామని సంబరపడ్డారు. కానీ ఇదే తమకు ఆఖరి పండుగ అనే విషయం ఆ చిన్నారులకు తెలియదు. కంటికి రెప్పలా కాపాడాల్సిన కన్న తండ్రే కాలయముడిలా మారి ఇద్దరిని అతి పాశవికంగా కాళ్లు,చేతులు కట్టేసి నీళ్ల బకెట్టులో ముంచి, ఊపిరి ఆడకుండా చేసి హత్య చేశాడు. అనంతరం తానూ కూడా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోటీ ప్రపంచంలో తన పిల్లలకు భవిష్యత్తు లేదని, అందుకే తన పిల్లల్ని చంపి తానూ ఆత్మహత్యకు పాల్పడుతున్నట్టు సూసైడ్ నోటు రాసి మృతి చెందడం తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకెళితే తాడేపల్లిగూడెంకు చెందిన వానపల్లి చంద్రకిషోర్ (37) భార్య తనూజాతో కలసి కాకినాడ అర్బన్ 2వ డివిజన్ తోట సుబ్బారావునగర్ రోడ్డు నెంబర్ -2, రామానాయపేట భూదేవి అపార్టుమెంట్‌లో ప్లాట్ నెంబర్ 202లో తొమ్మిదేళ్లుగా నివాసం ఉంటున్నాడు. కాకినాడ రూరల్ వాకలపూడి ఓఎన్‌జీసీలో అసిస్టెంట్ అకౌంటెంట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. వారికి ఇద్దరు సంతానం కాగా, వారిలో పెద్ద కుమారుడు వానపల్లి జోషిల్ (7), రెండో కుమారుడు నిఖిల్ (6)లు లిటిల్ ఉడ్స్ స్కూల్లో ఒకటో తరగతి, ఎల్‌కేజీ చదువుతున్నారు. శుక్రవారం ఉదయం ఓఎన్‌జీసీ కార్యాలయంలో హోలీ వేడుకలు చేసుకునేందుకు భార్య, ఇద్దరు పిల్లలతో కలసి వెళ్లాడు. అక్కడకు వెళ్లిన 10 నిమిషాలు అయిన తర్వాత కుమారులు ఇద్దరికీ యూనిఫామ్ కుట్టించేందుకు టైలర్ వద్దకు తీసుకువెళుతున్నానని చంద్ర కిషోర్ భార్యకు చెప్పి కుమారుల్ని వెంట తీసుకుని వెళ్లాడు.

పది నిమిషాల్లో వస్తానని చెప్పి..

పది నిమిషాల్లో వస్తానని చెప్పి వెళ్లిన భర్త ఎంతకీ రాకపోవడంతో భర్తకు ఫోన్ చేయగా 10 నిమిషాల్లో వచ్చేస్తానని భార్యకు చంద్రకిషోర్ బదులిచ్చాడు. ఎంతకీ భర్త ఇద్దరు పిల్లలతో రాకపోవడంతో కంగారు పడి భర్త ఆఫీసులో పని చేస్తున్న రామమూర్తిని ఇంటికి వెళ్లి చూసి రావాలని పంపించింది. అతడు వెళ్లగా ఫ్లాట్ డోర్లు లోపల నుంచి వేసి ఉండటంతో పలు సార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి బలవంతంగా కిటికీ గ్రిల్ ఓపెన్ చేసి లోపలికి వెళ్లి చూశాడు. చంద్రకిషోర్ బెడ్‌రూమ్‌లో ఫ్యానుకు ఉరేసుకోవడంతో విగతజీవిగా ఉండటాన్ని చూశాడు. పిల్లలు పక్కనే ఉన్న మరో బెడ్‌రూమ్‌లోని అటాచ్డ్ బాత్‌రూమ్‌లో పిల్లల చేతులు, కాళ్లు కట్టి వేసి, తలలను నీటితో నిండిన బకెట్లలో ముంచడంతో చనిపోయి ఉండటాన్ని పరిశీలించి చంద్రకిషోర్ భార్య, పోలీసులకు సమాచారం అందించాడు.

పోటీ ప్రపంచంలో భవిష్యత్తు లేదని...

అయితే చంద్రకిషోర్ సూసైడ్ నోట్ రాసి ఉంచాడు. దీనిని పోలీసులు, భార్య వచ్చి పరిశీలించగా తన పిల్లలకు పోటీ ప్రపంచంలో భవిష్యత్తు లేదని, అందుకే వారిని చంపి తానూ మరణిస్తున్నట్టు ఆ నోట్‌లో ఉంది. పిల్లల్ని క్రూరంగా చంపి భర్త కూడా ఆత్మహత్య చేసుకోవడాన్ని చూసిన భార్య కుప్పకూలిపోయింది. పిల్లలపై పడి కన్నీరుమున్నీరుగా విలపించింది. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న పిల్లల్ని ఇలా ఎందుకు చంపేశావు అంటూ రోధించింది. ఆర్థిక ఇబ్బందులు ఏమీలేవని సొంత ప్లాటు, కారు, ఆస్తులు ఉన్నాయని మృతుడి అన్నయ్య తెలిపారు. సర్పవరం ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టమ్ నిమిత్తం జీజీహెచ్‌కు తరలించామని, సూసైడ్ నోట్‌ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

పొగాకు బ్యారన్‌లో అగ్నిప్రమాదం

రూ.8 లక్షల ఆస్తినష్టం


యాదవోలులో మంటలను ఆర్పుతున్న ఫైర్ అధికారులు

దేవరపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం యాదవోలులో పొగాకు బ్యారన్‌లో శుక్రవారం అగ్నిప్రమాదం జరిగింది. యాదవోలుకు చెందిన వలవల సత్యవతి బ్యారన్లను అదే గ్రామానికి చెందిన ముమ్మడి శ్రీనివాస్ అద్దెకు తీసుకుని పొగాకు క్యూరింగ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం పొగాకు క్యూ రింగ్ చేస్తుండగా ఆకులు బీడింగ్ గొట్టంపై పడడంతో మంటలు వ్యాపించి కలప పూర్తిగా దగ్ధమైంది. జంగారెడ్డిగూడెం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు రూ.8 లక్షల ఆస్తినష్టం జరిగినట్టు రైతులు, ఫైర్ అధికారులు గుర్తించారు.

షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం


సీతాపురంలో కాలిపోతున్న ఇల్లు

ఎటపాక, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం సీతాపురం గ్రామంలో శక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధమైంది. సీతాపురం గొల్లగూడెం రోడ్‌లోని కాటూరి వెంకట నర్సమ్మకు చెందిన తాటాకింటికి షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకున్నాయి. కొద్దిసేపటికే ఇళ్లు మొత్తం దగ్ధమై గృహోపకరణాలు కాలిబుడిదయ్యాయి. నర్సమ్మ ఇంట్లోనే కొడుకు కాటూరి వెంకటేశ్వర్లు కుటుంబం కూడా కలిసి జీవిస్తున్నారు. 2 కుటుంబాలకు చెందిన సామగ్రి కాలిపోయింది. పక్కనే ఉన్న దారా దుర్గాప్రసాద్ చెందిన రేకుల ఇళ్లు పాక్షికంగా దగ్ధమైంది. ఇంటి ఆవరణలో ఉన్న అతడి ద్విచక్ర వాహనం కూడా మంటల్లో చిక్కుకుంది. సుమారు రూ.6లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్టు అంచనా. ఫైరింజన్ అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేసింది.

వేగం.. విషాదం!

తాడేపల్లిగూడెం హైవేపై ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

కుమార్తె సహా తల్లిదండ్రుల దుర్మరణం.. మరొకరికి గాయాలు


మరణించిన కుటుంబసభ్యుల ఫైల్‌ఫొటో

తాడేపల్లిగూడెం రూరల్/మండపేట, మార్చి 14(ఆంధ్రజ్యోతి): వేగంగా వచ్చిన కారు ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ఒకే కుటుంబానికి చెందిన చిన్నారి సహా తల్లిదండ్రులు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన బోగిళ్ల పాపారావు రెండో కుమారుడు వెంకట సత్య సురేన్ (39) హైదరాబాద్‌లో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. అతడి భార్య నవ్య(36), కుమార్తె వాసవీ కృష్ణ(4), వారి బంధువు ఉప్పులూరి శ్రీరమ్యతో కలిసి కారులో మండపేట బయలుదేరారు. కుంచనపల్లి వచ్చేసరికి హైవే పనులు చేసేందుకు నిలుపుదల చేసిన లారీని కారు వేగంగా వచ్చి ఢీకొని తునాతునకలైంది. డ్రైవ్ చేస్తున్న సురైన్, నవ్య ఘటనా స్థలంలో మృతిచెందగా చిన్నారి వాసవి కృష్ణని తణుకు లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందు తూ చనిపోయింది. శ్రీరమ్య కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో రాజమండ్రిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రమేష్ తెలిపారు.

మండపేటలో విషాదఛాయలు

సురేన్ కుటుంబ సభ్యులు ముగ్గురు దుర్మరణం పాలవడంతో ఆయన స్వస్థలమైన మండపేటలో విషాదఛాయలు అలుముకు న్నాయి. ఆయన రామచంద్రపురం వీఎస్ఎం కళాశాలలో ఎంబీఏ చేశాడు. చాలాకాలం క్రితం హైదరాబాద్ వెళ్లి ప్రైవేటు జాబ్ చేసుకుంటూ అక్కడే కుటుంబంతో ఉంటున్నాడు. అతడి భార్య నవ్య కె.గంగవరం మండలం యండగండి వాసి. వారి కుమార్తె వాసవితో కలిసి కారులో బయలుదేరి శనివారం మండపేటలో బంధువుల ఇంట జరిగే శుభ కార్యక్రమానికి, ఏడిదలో శివాలయంలో విగ్రహాల ప్రతిష్ఠకు హాజరయ్యేందుకు వస్తున్న సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో ముగ్గురు చనిపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. క్షేమంగా ఇంటికి చేరతారన్న సమయంలో ఈ దుర్ఘటన జరగడంతో జీర్ణించుకోలేకపోతున్నారు.

ప్రపంచ సాంకేతిక రంగంలో భారతదేశం ముందంజ

జేఎన్టీయూకే రిజిస్ట్రార్ రవీంద్రనాథ్

జేఎన్టీయూకే, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ సాంకేతిక రంగంలో భారతదేశం ముందంజలో ఉందని జేఎన్టీయూకే ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ అన్నారు. వర్సిటీలోని యూసీఈకే ప్రిన్సిపాల్ కార్యాలయ సెమినార్ హాల్లో ఐఐఐపీటీ డైరెక్టరేట్, ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో కోయంబత్తూరులోని జీకర్స్ ఎంప్లాయిమెంట్ కంపెనీ సహకారంతో రోబోటిక్ అప్లికేషన్ల కోసం కస్టమ్ ఎంబెడెడ్ బోర్డును అభివృద్ధి చేయడం అంశంపై జాతీయ స్థాయి ఎస్పార్క్స్-2025 టెక్నికల్ సింపోజియంలో భాగంగా శిక్షణను శుక్రవారం ప్రారంభించారు. 3రోజులు తరగతులు జరుగుతాయి. ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్, గౌరవ అతిథిగా ప్రిన్సిపాల్ మోహన్‌రావు పాల్గొన్నారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ ప్రపంచంలో ప్రస్తుతం ఆదరణలో ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్‌లెర్నింగ్, ఐఓటీ, డేటాసైన్స్, రోబోటిక్స్, త్రీడీ ప్రింటింగ్, డ్రోన్ టెక్నాలజీ కోర్సులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. డైరెక్టర్ బీటీ కృష్ణ అధ్యక్షతన నిర్వహిస్తున్న తరగతులకు బి.లీలాకుమారి కన్వీనర్‌గాను, పి.పుష్పలత సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు. అధ్యాపకులు, అను బంధ కళాశాలల విద్యార్థులు 80 మంది పాల్గొన్నారు.

కూతురి బాధ..అప్పుల వ్యథ!

- తట్టుకోలేక గోదారిలో దూకేసిన దంపతులు
- మృతదేహాల గుర్తింపు



వెంకటరమణ, వరలక్ష్మి మృతదేహాలు

రాజమహేంద్రవరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక కాకినాడకు చెందిన దంపతులు గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా తూరంగికి చెందిన కాళ్ల వెంకటరమణ(55) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడి భార్య వరలక్ష్మి(50) చీటీలు వేస్తారు. చాలా కాలంగా నమ్మకంగా ఉంటున్నారు. దీంతో స్థానికులు కూడా ఎంతో నమ్మారు. ఈ క్రమంలో దాదాపు రూ.60 లక్షల వరకూ అప్పులు చేశారు. తమ సొంతింటిని విక్ర యించి రూ.45లక్షల వరకూ అప్పులు తీర్చారు. ఇదిలా ఉండగా ఆరు నెలల కిందట ఒక్కగానొక్క కూతురు ప్రేమ వివాహం చేసుకుని ఇంటి నుంచి వెళ్లి పోయింది. ఒక వైపు కూతురి బాధ..మరో వైపు అప్పుల వాళ్ల పీడించడంతో మానసికంగా నలిగిపోయారు. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో రాజమహేంద్రవరం పిండాల రేవుకు వచ్చి కూతురిని తలచుకుని బాగా రోధించారు. తర్వాత ఇద్దరూ గోదావరిలోకి దూకి ప్రాణాలు విడిచారు. తాము ఆర్థిక ఇబ్బందులతో చచ్చి పోతున్నామంటూ గోదా వరి గట్టుపై ఓ లెటర్‌ను ఉంచారు. తమ ఆధార్ కార్డులను కూడా అక్కడే పెట్టారు. స్థానికుల సమాచారం తో టూటౌన్ సీఐ మంగాదేవి ఆదేశాల మేరకు సిబ్బంది చేరుకుని గాలింపు చేపట్టారు. కొద్ది సమయంలో మృతదేహాలను గుర్తించారు. ఆధార్ కార్డుల ఆధారంతో వారి చిరునామా తెలుసుకుని బంధువులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో శవ పరీక్షల అనంతరం మృతదేహాలను సంబంధీకులకు అప్పగించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ మంగాదేవి పేర్కొన్నారు.

ఇసుకలోడుతో లారీ వెళ్తుండగా కూలిన వంతెన

మామిడికుదురు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం నగరంలోని వంతెనపై నుంచి ఇసుకలోడుతో లారీ వెళ్తున్న సమయంలో వంతెన కూలిపోయింది. వంతెన కూలడంతో ఇసుకలోడు లారీ కాల్వలోకి దిగబడిపోయింది. లారీ దిగబడిపోయినప్పటికీ ఎవరికీ ఏవిధమైన ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రధాన పంటకాల్వపై ఉన్న ఈ వంతెన శిథిలస్థితికి చేరడంతో ఈ ప్రమాదం సంభవించిందని స్థానికులు పేర్కొంటున్నారు. శిథిలమైన వంతెన గురించి చాలాకాలంగా స్థానికులు భయపడుతున్నారు. శుక్రవారం ప్రమాదం జరిగి ఏవిధమైన ప్రాణ నష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

స్వీయశిక్ష సరైన విధానం కాదు

ఎస్టీయూ రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ జయత్రినాథబాబు

దివాన్‌చెరువు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల బంగారు భవిష్యత్‌ను ఆకాంక్షిస్తూ ఉపాధ్యాయులు స్వీయ శిక్షను విధించుకోవడం సరైన విధానం కాదని ఎస్టీయూ రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ సూరి జయత్రినాథబాబు అభిప్రాయం వ్యక్తం చేశారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు .రాష్ట్రంలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల స్వీయ శిక్ష పట్ల విచారం వ్యక్తం చేశారు. పాఠశాలల్లో విద్యార్థులను దండించి చదివిద్దామంటే ప్రస్తుతం ఉపాధ్యాయులకు కుదరడం లేదన్నారు. అలాగని ఉపాధ్యాయులు తమను తాము శిక్షించుకున్నప్పటికీ ఆశించిన ప్రయోజనం చేకూరుతుందన్న నమ్మకం లేదని చెప్పారు. పైగా ఇటువంటి చర్యలు వల్ల ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రుల్లో భిన్నాభిప్రాయాలు ఏర్పడితే దాని వల్ల పాఠశాలల మనుగడకే ప్రమాదం ఏర్పడుతుందని, స్వీయశిక్షలు విధించుకోవడం మానుకోవాలని ఉపాధ్యాయులను కోరారు. అటు విద్యార్థులు ఇటు విద్యావేత్తలకు ప్రయోజనం చేకూర్చే విధంగా సానుకూల అభ్యసనా వాతావరణాన్ని ఏర్పరచుకోవాలని త్రినాథబాబు కోరారు. సమావేశంలో నాయకులు భీమేశ్వరరావు, ధర్మరాజు, సూరిబాబు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ టెక్నాలజీలో ఉపాధి అవకాశాలు మెండు

ఆర్ట్స్ కళాశాలలో డ్రోన్ టెక్నాలజీపై మూడురోజుల వర్క్‌షాప్



ఎంవోయూ చేసుకుంటున్న ఆర్ట్స్ కళాశాల, ఏయూ-ఐసీడీటీ

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఉద్యమిత, అభివృద్ధి చెందుతున్న సాంకేతికల్లో డ్రోన్ టెక్నాలజీ ఒకటని, ఈ రంగంలో యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని పలువురు పేర్కొన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో మూడు రోజులపాటు రాష్ట్రస్థాయి డ్రోన్ టెక్నాలజీ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాల, ఏయూ-ఐసీడీటీ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ప్రిన్సిపాల్ రామచంద్రరావు వర్క్‌షాపును ప్రారంభించి మాట్లాడుతూ డ్రోన్ టెక్నాలజీ వినియోగాలు, భవిష్యత్ అవకాశాలను వివరించారు. ఏయూ-ఐసీడీటీ అధ్యక్షుడు ఓఆర్ఎం రావు మాట్లాడుతూ డ్రోన్ టెక్నాలజీ అభివృద్ధిలో తాము చేపడుతున్న కార్యకలాపాలు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రోన్ల వినియోగానికి ఇస్తున్న ప్రాధాన్యతతోపాటు, ప్రధానంగా విపత్తు నిర్వహణతో పాటు అనేక రంగాల్లో డ్రోన్ల సాంకేతికతను అమలు చేస్తున్న తీరును విశదీకరించారు. కార్యక్రమంలో భౌతికశాస్త్ర విభాగాధిపతి బి.కోమల లక్ష్మి, ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ మూర్తి, కార్యక్రమ కార్యదర్శి పి.షణ్ముకరావు, కన్వీనర్ బి.ప్రతిమ, కో కన్వీనర్ సునంద తదితరులు పాల్గొన్నారు.

చిత్రాడ తరలిన జనసైనికులు



చిత్రాడ సభకు వెళుతున్న దొడ్డిగుంట జనసైనికులు

బిక్కవోలు/రాజానగరం/రంగంపేట/గోకవరం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడలో జరిగే జనసేన ఆవిర్భావ సభ(జయకేతనం)కు శుక్రవారం బిక్కవోలు, రాజానగరం, రంగంపేట, గోకవరం మండలాల నుంచి భారీగా జనసైనికులు, వీరమహిళలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. బిక్కవోలు నుంచి జనసైనికులు నూతంగి శ్రీనివాస్, వడ్లమూరి గోవిందరాజు, బిట్టు, దొడ్డా వెంకటేష్, పిల్లా సునీల్, నూతంగి ప్రసాద్, మసాల పండు తదితరులు బైక్‌లు, ఆటోలపై చిత్రాడ వెళ్లారు. జనసైనికులను తరలించడానికి రంగంపేటలో బస్సులను ఏర్పాటు చేశారు. దొడ్డిగుంట, ఈలకొలను తదితర గ్రామాల నుంచి జనసైనికులు వెళ్లారు. గోకవరం మండలం నుంచి కార్లు, బస్సులు, ఇతర వాహనాలు ఏర్పాటు చేసుకొని జనసైనికులు, వీరమహిళలు చిత్రాడ వెళ్లారు. ఉదయం నుంచే చాలా గ్రామాల్లో జనసైనికుల హడావుడి కనిపించింది.

కనుల పండువగా లక్ష్మీ జయంతి

రాజానగరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీ జయంతి సందర్భంగా మండలంలో చక్రద్వారబంధంలో నూతనంగా నెలకొల్పిన శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక కుంకుమార్చన, లక్ష్మీ కుబేర హోమాలు శుక్రవారం కన్నుల పండువగా నిర్వహించారు. కొల్హాపూర్ మహాలక్ష్మి సన్నిధి నుంచి తీసుకొచ్చిన లక్ష్మీ కుబేర యంత్రానికి మహిళలతో కుంకుమార్చనలు, ప్రత్యేక హోమం జరిపారు.అనంతరం పూర్ణాహుతి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం

బిక్కవోలు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): కొంకుదురులోని శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ స్థాపన 17వ వార్షికోత్సవ శుక్రవారం నిర్వహించారు. పెద్దాపురం మహారాజులు నిర్మించిన ఈ ఆలయంలో పడగ రూపంలో స్వామి పూజలందుకునేవాడు. 2008లో మల్లిడి కోదండం సోదరులు విగ్రహాలను ఏర్పాటు చేశారు. శుక్రవారం ఆలయంలో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉక్కు కార్మికులకు బకాయి జీతాలు చెల్లించాలి

రాజమహేంద్రవరంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నిరసన

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ప్రకటించిన ప్యాకేజీలో కార్మికులకు బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని, స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్టీల్‌ప్లాంట్ సమస్యలపై కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా నగరంలోని శ్యామలాసెంటర్‌లో కేంద్ర కార్మిక సంఘాలు సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, ఏఐసీటీయూ, యువజన, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐయూటీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ మూర్తి, ఏఐటీయూసీ నాయకులు నల్ల రామారావు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేస్తామని కేంద్ర ప్రభుత్వం పైకి ప్రకటనలు ఇచ్చినా దొడ్డిదారిన ప్రైవేటీకరణ పనులను వేగవంతం చేసిందని, ఇది దారుణమని అన్నారు. నిలుపుదల చేసిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ ఆగిపోయే వరకూ కార్మిక సంఘాలు వెనక్కి తగ్గేదిలేదని స్పష్టం చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పవన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు జువ్వల రాంబాబు, కర్రి రామకృష్ణ, పూర్ణిమరాజు, సావిత్రి, సుబ్రహ్మణ్యం, వి.కొండలరావు, సప్ప రమణ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం చర్చలు జరపాలి

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉద్యోగ సంఘాలతో చర్చలు జరపాలని ప్రభుత్వ ఉద్యోగుల నగర సభ డిమాండ్ చేసింది. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరగడం వల్ల రాష్ట్రంలో అశాంతికి దారితీస్తోందని హెచ్చరించింది. శుక్రవారం సాయంత్రం స్థానిక చందాసత్రం పార్వతీపరమేశ్వర కల్యాణ మండపంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) నగరశాఖ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు పి.గిరిప్రసాద్ వర్మ మాట్లాడుతూ ఉద్యోగుల బకాయిల చెల్లింపునకు రూట్‌మ్యాప్ ప్రకటించాలని, ప్రభుత్వ హామీలు అమలు చేయాలని కోరుతున్నామని అన్నారు. నగరశాఖ అధ్యక్షుడు జీబీ విజయకుమార్, సీహెచ్ విల్సన్‌పాల్, ఛాంబర్లిన్, బి.నాగేశ్వరరావు, ఉమెన్స్ వింగ్ నాయకురాలు నగర ఉపాధ్యక్షుడు పి.అంజలిశ్రీ మాట్లాడారు.

తల్లిదండ్రులూ.. పిల్లలను ఒత్తిడి చేయొద్దు

కడియం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పిల్లలను ఇతరులతో పోల్చడం, వారిపై మానసిక ఒత్తిడి పెంచడం తల్లిదండ్రులు చేయకూడదని ముద్దమందారం ఫేమ్, సినీనటుడు కె.ప్రదీప్ తెలిపారు. కడియంలో శుక్రవారం షిర్డి సాయి విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఎయిమ్ పేరిట విద్యార్థుల తల్లులకు నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. పిల్లలను ఇతరులతో పోల్చడం వల్ల వారిలో ఆత్మస్థైర్యం దెబ్బతింటుందన్నారు. టీవీ ప్రయాక్త కె.సరస్వతి మాట్లాడుతూ పిల్లలకు కావాల్సినవి మనం చేసి మనకు కావాల్సినవి టెక్నిక్స్ ఉపయోగించి వారితో చేయించాలన్నారు. పేరెంట్ ఎడ్యుకేషన్ ట్రైనర్ చిట్టి విష్ణుప్రియ మాట్లాడుతూ తల్లిదండ్రులు ఆవేశాన్ని కోపాన్ని అదుపులో ఉంచుకోవాలన్నారు.



పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

రూ.81 వేల నగదు స్వాధీనం

రాజానగరం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని తొర్రేడులోని టిడ్కో గృహ సముదాయాల సమీపంలో సాగుతున్న పేకాట శిబిరంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. వారి నుంచి రూ.81 వేలు నగదును స్వాధీనం చేసుకోవడంతో పాటు ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్.ఐ మనోహర్ తెలిపారు. పట్టుబడిన వారంతా సీతానగరం, రాజమహేంద్రవరం రూరల్, సిటీ ప్రాంతాలకు చెందిన వ్యక్తులని, ఈ మేరకు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

హోలీ..రంగుల కేళీ

- ఒంటికి రంగులు పూసుకుని వేడుక చేసుకున్న యువత
- వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే వాసు



రాజమహేంద్రవరంలో హోలీ వేడుకల్లో చిన్నారులు

రాజమహేంద్రవరం సిటీ/అర్బన్/బిక్కవోలు/గోకవరం, మార్చి 14(ఆంధ్ర జ్యోతి): జిల్లాలో హోలీ పండుగను అత్యంత ఘనంగా ప్రజలు చేసుకున్నారు. శుక్రవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం వసంతోత్సవాన్ని నిర్వహించారు. యువతీయువకులు రంగునీళ్లను ఒకరిపై ఒకరు జల్లుకున్నారు. వసంత కాలం ఆరంభంలో వచ్చే సాంప్రదాయ పండుగ హోలీ. ఈ పండుగ ఉత్తరాది రాష్ట్రాలతోపాటు మన రాష్ట్రంలోను ఘనంగా నిర్వహిస్తా రు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరంలో విద్యార్థులు, యువత రంగులు చల్లుకుని వేడుక చేసుకున్నారు. స్కూళ్లకు సెలవు కావడంతో పిల్లలు ఇంటి వద్దనే తోటి స్నేహితులతో కలసి హోలీని జరుపుకున్నారు. స్థానిక నాళం భీమరాజు వీధి, మెయిన్ రోడ్డు, గెయిల్ ఆఫీస్ రోడ్డు, జైన్స్ ఆలయం, ఏవీఏ రోడ్డు, జేఎన్ రోడ్డు, మన్యం గ్రౌండ్స్‌లో హో లీ పండగను మర్వాడీలు, జైనులు, నగర వా సులు ఘనంగా జరుపుకున్నారు. ఆనందం గా గడిపారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ నగరంలో పలు ప్రాంతా ల్లో జరి గి న హోలీ వే డు కల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు స్థానికులు రంగుల పూశారు. నగరపాలక సంస్థ కా ర్యాలయంలో కమిషనర్ కేతన్ గార్గ్ తన కార్యాలయ, అన్ని విభాగాల అధికారులతో రంగులు పూసుకుని వేడుక చేశారు. ఉద్యో గులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు, ఇతరల సిబ్బంది పాల్గొన్నారు. స్వీట్లు పంచుకుని ఆనందంగా గడిపారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు



వెలంపేటలో పిల్లలు, మహిళల హోలీ వేడుకలు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సీతానగరం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పోలవరం కెనాల్ ఫీడర్‌లో పనుల కోసం ఈ నెల 15న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పనుందని ట్రాన్స్‌కో ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు.ఉదయం 10గం నుంచి మధ్యాహ్నం 2గం. వరకు పురుషోత్తపట్నం, రామచంద్రపురం,వంగలపూడి, సింగవరం, పెద కొండేపూడి, అచ్చియ్యపాలెం, చీపురుపల్లి, నేలకోట గ్రామాలకు సరఫరానిలిపివేస్తామన్నారు.

నరసన్న కొండకు పోటెత్తిన భక్తులు

- వైభవంగా ముగిసిన కోరుకొండ తీర్థం
- కొండ పైన, దిగువున నరసింహ స్వామిని దర్శించుక్ను భక్తజనం



కంబాల శ్రీనివాసరావును సత్కరిస్తున్న దృశ్యం

కోరుకొండ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): కోరుకొండ తీర్థంగా పిలువబడే లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు వైభవంగా ముగిసాయి. చివరి రోజైన శుక్రవారం భక్తులు పోటెత్తారు. కొండ పైన, దిగువున భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కొండ పొడవునా అనేక మంది భక్తులు స్వామివారి కొండ మెట్లకు పసుపురాసి బొట్టు పెట్టుకుంటూ వెళ్లారు. మరికొందరు మోకాళ్లపై కొండెక్కారు. అర్ధరాత్రి వరకు భక్తులు వచ్చారు. శుక్రవారం హోళీ సందర్భంగా సెలవు దినం కావడంతో భక్తుల సంఖ్య మరింత పెరిగింది.

అర్ధరాత్రి వరకు అన్నదానం

కోరుకొండ తీర్థానికి వచ్చిన భక్తులకు శుక్రవారం ఉదయం 10 నుంచి అర్ధరాత్రి వరకు మిరియాల వెంకటరెడ్డి పంతులు ధర్మసత్రంలో ఉచిత అన్నదానం చేశారు. సత్రం ఈవో గండి వెంకట లక్ష్మీకుమార్, వి.సూరిబాబు ఆధ్వర్యంలో కూటమి నాయకులు, కార్యకర్తల సహకారంతో అన్నదానం జరిపారు. కార్యక్రమంలో బీజేపీ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరి, అన్నవరం దేవస్థానం డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


రంగనాథ ఆలయ పునః నిర్మాణానికి రూ.3లక్షల విరాళం

కోరుకొండలో రంగనాథ స్వామి ఆలయ పునః నిర్మాణానికి విశ్వ హిందూ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు రూ.3 లక్షల విరాళాన్ని కటకం చలంకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును ఆలయ ప్రాంగణంలో పరాసర లక్ష్మీనరసింహభట్టర్, పెదపాటి గిరిధరాచార్యులు సత్కరించారు. అంతకుముందు రామానుజ కూటమిలో ఏసీల ఏర్పాటుకు రూ.2 లక్షలు ఖర్చు చేసినట్టు లక్ష్మీనరసింహభట్టర్ తెలిపారు.అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆలయ పునః నిర్మాణానికి రూ.1.50 కోట్లను సేకరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో పలువురు శ్రీవైష్ణవ సంఘం వారు, అర్చకులు, టీడీపీ, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీపై పోలీసుల దాడి

55 లీటర్ల సారా స్వాధీనం

గోకవరం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): గోకవరం గ్రామశివారున గంగాలమ్మ గుడి సమీపంలోని పామాయిల్‌తోటలో నిర్వహిస్తున్న సారా బట్టీపై శుక్రవారం దాడి చేసినట్టు ఎస్ఐ వీఎస్‌వీ పవన్‌కుమార్ తెలిపారు. ఈ దాడిలో 55 లీటర్ల సారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు 500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు చెప్పారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచనున్నట్టు ఎస్ఐ పేర్కొన్నారు.





జనసేన ఆవిర్భావ వేడుకలు



రాజానగరం బస్టాండ్ వద్ద కేక్ కట్ చేస్తున్న జనసైనికులు

రాజానగరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలను రాజానగరంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో పార్టీ మండలాధ్యక్షుడు వేగిశెట్టి రాజు, మహిళా సాధికారత అధ్యక్షురాలు నంద్యాల లక్ష్మి జెండా ఆవిష్కరించారు. అనంతరం పులిహోర, మజ్జిగ ప్యాకెట్లు, అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు వీరమహిళలు పాల్గొన్నారు.

రంగంపేట: మండలంలోని ఈలకొలను గ్రామంలో జరిగిన కార్యక్రమంలో జనసేన మండల ప్రధాన కార్యదర్శి ఎజ్జు సుబ్రహ్మణ్యంనాయుడు పార్టీ జెండా ఎగురవేశారు. రాజకీయ పార్టీల్లో మార్పు రావాలని, ప్రజాసంక్షేమమే పాలకుల లక్ష్యం కావాలని, పాలనలో పారదర్శకత తీసుకురావడం ద్వారా పేదరికం నిర్మూలించాలనే లక్ష్యంతో పవన్‌కల్యాణ్ జనసేన పార్టీ స్థాపించారన్నారు. అనంతరం కేక్ కోసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కడిమి సాయిబాబు, తిక్కిశెట్టి తమ్మిరాజు, తిక్కిశెట్టి శివకృష్ణ, తిక్కిశెట్టి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు చేయడం చేతగానితనం

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కాలుష్యాన్ని వెదజల్లే గ్రాసిమ్ ఇండస్ట్రీకి అనుమతులిచ్చి ఫ్యాక్టరీని ప్రారంభించింది బలభద్రపురం గ్రామాన్ని అస్తవ్యస్తం చేసింది వైసీపీ ప్రభుత్వమని మరిచిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అసత్య ఆరోపణలు చేయడం చేతగానితనమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం అనపర్తిలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బిక్కవోలు మండలం కాపవరంలో చెత్త నుంచి విద్యుత్ తయారీ ఫ్యాక్టరీ ఏర్పాటుపై ఇప్పటికే తన వైఖరిని చెప్పామని, అనపర్తి నియోజకవర్గంలో ఫ్యాక్టరీని అనుమతించబోమన్నారు. రెండు నెలలుగా దీనిపై కాపవరం సర్పంచ్‌ను అధికారులు ఇబ్బంది పెడుతున్నారని చెబుతున్నా మాజీ ఎమ్మెల్యే నోరు ఎందుకు మెదపలేదని ప్రశ్నించారు. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే పరిశ్రమను నెలకొల్పనీయమని నల్లమిల్లి స్పష్టం చేశారు. సమావేశంలో సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి కర్రి బులిరెడ్డి, మేడపాటి హరినారాయణరెడ్డి, సర్పంచ్ గొల్లు హేమతులసి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పాత సోమాలమ్మ జాతర



రాజమహేంద్రవరం కల్చరల్ 14(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్యామలానగర్‌లో శ్రీ పాత సోమాలమ్మ జాతర ఉత్సవాలు గురువారం ముగిశాయి. ఆలయ ధర్మకర్త గొర్రెల సురేష్ దంపతులు తెల్లవారుజామున అమ్మవారిని పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు, కుంకుమతో అభిషేకించి, ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం ఎంఎల్‌ఏ ఆదిరెడ్డి వాసు, వాసిరెడ్డి రాంబాబు, జక్కంపూడి గణేష్, ఎస్ఎన్ రాజు తదితరులు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. గరగనృత్యాలు, మంగళవాయిద్యాలతో అమ్మవారిని ఊరేగించారు. ఈ నెల 23న మహాన్నదానం నిర్వహించనున్నట్టు సురేష్ తెలియజేశారు.

పేద విద్యార్థినికి ఎమ్మెల్యే వాసు ఆర్థిక సాయం

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎన్ రోడ్డు షిరిడి సాయిమార్గ్‌కు చెందిన పేద విద్యార్థిని హర్షితకు ఉన్నత చదువు నిమిత్తం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు రూ.45 వేలు ఆర్థిక సాయం అందించారు. శుక్రవారం తిలక్‌రోడ్డులోని కార్యాలయంలో హర్షితకు భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఈ సాయం అందించారు. కష్టాల్లో ఉన్న వారికి, పార్టీ కుటుంబసభ్యులకు అండగా నిలబడతామని వాసు అన్నారు. కాగా హర్షిత సూరంపాలెం ఆదిత్యలో బీబీఏ ఫస్టియర్ చదువుతోంది. ఇదిలా ఉండగా తాడితోటలోని నూర్ మసీదు వద్ద జరిగిన ఇఫ్తారు విందుకు హజరైన ఎమ్మెల్యే వాసు తన తండ్రి మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావుతో కలిసి మసీదు షెడ్డు నిర్మాణానికి రూ1.50 లక్షలు విరాళం ప్రకటించారు. ముస్లింలు నమాజ్ చేసుకోవడానికి అనుకూలంగా ఉండేందుకు షెడ్డు ఏర్పాటు నిమిత్తం సాయం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి ఇఫ్తారు విందును స్వీకరించారు. కార్యక్రమాల్లో కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాశీ నవీన్ కుమార్, మజ్జి రాంబాబు, నక్కా దేవివరప్రసాద్, పిల్లి శ్యామ్, మొకమాటి సత్యనారాయణ, మదినా సాహెబ్ పాల్గొన్నారు.

శ్రీకృష్ణచైతన్య ఆశ్రమంలో ధ్వజస్తంభ పునప్రతిష్ఠ


రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని ఆర్యాపురం శ్రీ కృష్ణ చైతన్య మిషన్ ఆశ్రమంలో శ్రీకృష్ణ చైతన్య ప్రభువుల ఆవిర్భావ, ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. నాగులకొండ జేజినాథ స్వామి ఉమాకుమారి దంపతుల సహకారాలతో ధ్వజస్తంభం పునః ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించినట్టు ఆశ్రమ ఇన్‌చార్జి శ్రీపాద హరిదాసు బ్రహ్మచారి తెలిపారు.ఆచార్య భక్తి కంకణ వనమహరాజ్ ఆధ్వర్యంలో మహాప్రభువుల లీలా ప్రవచనం,మహాభిషేకం,హారతి, హోలీ వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'మాజీ మంత్రి బత్తిన కాంస్య విగ్రహాన్ని ప్రభుత్వమే ఏర్పాటు చేయాలి'

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ మంత్రి బత్తిన సుబ్బారావు కాంస్య విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని బత్తిన సుబ్బారావు సేవా సమితి వ్యవస్థాపక చైర్మన్ బర్రే కొండబాబు కోరారు. స్థానిక క్వారీ ప్రాంతంలో శుక్రవారం జరిగిన బత్తిన సేవా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. బడుగు బలహీనవర్గాల జన హృదయాల్లో సుబ్బారావు నేటికి నిలిచి ఉన్నారన్నారు. స్థానిక క్వారీ సెంటర్ నుంచి లాలాచెరువు వెళ్లేదారిలో ప్రస్తుతం ఉన్న బత్తిన విగ్రహం స్థానంలో కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరతామన్నారు. దీని కోసం ఎమ్మెల్యేలు, మంత్రులకు వినతిపత్రలు అందిస్తామని కొండబాబు పేర్కొన్నారు.









మీరే నా బలం : జనసైనికులకు పవన్ అభివాదం



ఇదీ నా సేన : జయకేతనం సభా వేదికపై పవన్‌తో పాటు నాయకులు



సభకు లక్షలాదిగా హాజరైన జనం

జన పవనాలు!



మీ వెంటే..





అంతా ఓకేనా : నాదెండ్లతో మాట్లాడుతున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్



అభిమానమే.. బలం : జయకేతనం సభా వేదికపై మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్



జన సైనికులమే : సభా వేదికపై ఆశీనులైన మహిళలు.. ఇతర నాయకులు



ఎగసిపడిన పవన్ అభిమానం



జన సైనికులే..జనసేన బలం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

చిత్రాడ దద్దరిల్లింది.. జన సందోహంతో గర్జించింది.. అంచనాలకు మించి తరలివచ్చిన జనంతో పోటెత్తింది.. ఆవిర్భావ సభ పండగను సంతరించుకుంది.. కనుచూపుమేరలో జనం..కళ్లు మిరిమిట్లు గొలిపేలా లైటింగ్.. వేలల్లో బారులు తీరిన బస్సులు.. కార్లు.. కనివినీ ఎరుగని ఏర్పాట్లతో నభూతో నభవిష్యత్తు అనే తరహాలో జయకేతనం సభ జయజయ ధ్వానాలతో దద్దరిల్లింది..అటు జనసేనాని పవన్‌కల్యాణ్ తన ప్రసంగంలో జనసైనికుల గురించే అధికంగా ప్రస్తావించి వారి మనసులు గెలుచుకున్నారు. పార్టీ నూరుశాతం స్ట్రైక్ రేట్ సాధించడంలో వారి పాత్ర ఎనలేనిదని కొనియాడి అందరి గుండెలను తట్టారు. ఇన్నేళ్లలో ఎందరో జనసైనికులు పార్టీ సిద్ధాంతాల కోసం చనిపోయిన వైనాన్ని గుర్తుచేసి వారి సేవలు ఎనలేనివని కొనియాడారు. వెరసి జనసైనికులతోనే తన బంధం.. అనుబంధం అని వెల్లడించి పార్టీ క్యాడర్ తన దృష్టిలో ఎంత గొప్పస్థానం దక్కించుకున్నారో వివరించి అందరితో చప్పట్లు కొట్టించుకున్నారు. అటు చిత్రాడ సభ కనివినీ ఎరుగని రీతిలో సక్సెస్ అయింది. అంచనాలకు మించి జనం భారీగా తరలి రావడంతో సభా ప్రాంగణం మధ్యాహ్నానికే కిక్కిరిసింది. రాష్ట్రవ్యాప్తంగా దారులన్నీ చిత్రాడవైపే కదలడంతో కత్తిపూడి నుంచి కాకినాడ వరకు 216హైవే ఇసుకేస్తే రాలనంతగా మారిపోయింది.మహిళలు.యువత..రైతులు.. ఇలా అన్ని వర్గాలు సభకు హాజరవడం కన్నులపండువగా కనిపించింది. అటు పవన్ టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి ఇప్పటివరకు డిప్యూటీ సీఎంగాను,పంచాయతీరాజ్, అటవీశాఖ మంత్రిగా సాధించిన విజయాలను ప్రత్యేక వీడియో ద్వారా ప్రదర్శించడం అందరినీ ఆకట్టుకుంది.పవన్ కోసం జనం ఉదయం నుంచే సభా ప్రాంగణానికి చేరుకున్నారు. దీంతో మూడు ప్రవేశద్వారాలు కిక్కిరిసిపోయాయి. అటు పోలీసులేమో మధ్యాహ్నం 12గంటల నుంచే లోపలకు అనుమతించడంతో జనం ఆరుబయటే ఎండలో ఉండిపోయారు.ఆ తర్వాత మధ్యాహ్నం మూడు గంటలకే సభలోని అన్ని గ్యాలరీలు నిండిపోయాయి. దీంతో వేలాది జనం బయటే ఉండిపోయారు. చాలా మంది వద్ద వీవీఐపీ, వలంటీర్ల పాసులు ఉన్నా పోలీసులు లోపలకు పంపకపోవడంతో చాలాసేపు వాగ్వాదం జరిగింది. అటు ఎండ తీవ్రత చాలా ఎక్కువగా ఉండడంతో కొందరు మహిళలు సొమ్మసిల్లిపడిపోయారు. కానీ అంచనాలకు మించి తరలివచ్చిన జనం ఎక్కడా ఎండకు భయపడకుండా రాత్రి పదిన్నర వరకు సభలోనే ఉండిపోయారు.



పవనే..మా నాయకుడు



విజయకేతనమే..

4:30 గంటలకు పవన్..

పవన్‌కల్యాణ్ సరిగ్గా 4.30గంటలకు సభా ప్రాంగణానికి హెలికాప్టర్‌లో చేరుకున్నారు. అనంతరం సభా వేదిక పక్కనే ఉన్న ప్రత్యేక బసలోకి వెళ్లి తిరిగి స్టేజీ మీదకు రాత్రి 7.30 గంటలకు చేరుకున్నారు. ఈలోపు చాలాసేపు మంత్రి నాదెండ్లతో భేటీ అయ్యారు. అటు పవన్ వచ్చిన హెలికాప్టర్ సాయంత్రం ఐదుగంటలకు కాకినాడ వెళ్లింది. సభ ముగిసిన తర్వాత పవన్ కాకినాడలో జేఎన్టీయూ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. తిరిగి శనివారం ఉదయం పవన్ హెలికాప్టర్‌లో అమరావతికి బయలుదేరనున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి సభలో జనసేన ఎంపీ ఉదయ శ్రీనివాస్, మంత్రి దుర్గేష్, పలువురు ఎమ్మెల్యేలు ప్రసంగించారు. పవన్ తన ప్రసంగంలో ఎక్కడా పిఠాపురం నియోజవకర్గం గురించి ప్రత్యేకంగా ప్రస్తావన తేలేదు.అనేక విస్తృత అంశాలపై అనర్గళంగా ప్రసంగించడంతో సభకు వచ్చిన వారంతా చప్పట్లతో పవన్‌ను అభినందించారు. పవన్ సైతం సభను సక్సెస్ చేయడానికి శ్రమించి, సహకరించిన కాకినాడ కలెక్టర్,ఎస్పీతోపాటు పోలీసులను అభినందించారు.సినిమాలనుంచి తన రాజకీయ ప్రస్థానం వరకు కూలంకషంగా చర్చించడం అభిమానులను అలరించింది. జనసేనకు అధికారం ఇవ్వడం వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతున్న విషయాన్ని వివరించి అందరినీ ఆకట్టుకున్నారు. ప్రసంగం మధ్యలో పవన్ అని జనం అరుస్తుండడంతో.. కొంత అసహనం చెందిన పవన్ నా పేరు అరుస్తున్నారు.. అంటే.. నా ప్రసంగం వినడం లేదని అర్థం అని చురకలు అంటించడంతో జనసైనికులు ప్రసంగంపై దృష్టిసారించారు. జగన్‌లా తాను కోడికత్తి రాజకీయాలు చేయడం లేదని సైద్ధాంతిక రాజకీయాలు చేస్తున్నాని గుర్తుచేశారు.పదేళ్లలో పడ్డాం..నిలబడ్డాం అని పేర్కొని జనసేన ప్రస్థానాన్ని గుర్తుచేశారు. రానున్న రోజుల్లో యువ నాయకులను తయారు చేయడమే లక్ష్యంగా జనసేన ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. సభ ముగిసిన తర్వాత జనం తిరిగి స్వస్థలాలకు తిరిగి వెళ్లే సమయంలో వారందరికీ భోజన వసతిని పార్టీ సమకూర్చింది.అంచనాలకు మించి వచ్చిన జనానికి ఎక్కడా భోజనాలకు ఇబ్బంది లేకుండా ఆతిథ్యం వహ్ వా అనేలా చేసింది. అటు రాష్ట్రస్థాయి సభ చిత్రాడలో జరుగుతుండడంతో ఊరి గురించి ప్రతి ఒక్కరూ ఆరా తీయడంతో గూగుల్‌లో ట్రెండింగ్‌గా మారింది. హోటళ్లు, రెస్టారెంట్లు భారీగా కిక్కిరిశాయి.



- బంధం.. అనుబంధం మీరే
- మీ అందరి శ్రమతోనే అధికారంలోకి..
- వైసీపీ అరాచకాలను బద్దలు కొట్టాం
- మమ్మల్ని మీరే క్రమశిక్షణలో ఉంచాలి
- చిత్రాడ సభలో పవన్ కల్యాణ్
- అంచనాలకు మించి జనం
- మధ్యాహ్నానికే నిండిన వేదిక
- చోటులేక బయట వేలల్లో
- అదిరిపోయిన ఏర్పాట్లు
- వహ్‌వా అనిపించిన ఆతిథ్యం
- తరలివచ్చిన మహిళలు
- తీవ్ర ఎండతో ఇబ్బందులు



ఏ తరమైనా..అభిమానమే..



అభిమాన హారతి..



మా గురుతు.. పవన్..



అదిరే ఆతిథ్యం : కాకినాడ నుంచి చిత్రాడ వరకూ పలు చోట్ల ఆహార కేంద్రాలు ఏర్పాటు చేసి మధ్యాహ్నం.. సాయంత్రం కూడా బిరియానీ.. భోజనాలు అందించారు.



జై..జై.. జనసేన

నేటి నుంచి ఒంటిపూట బడులు

రాజమహేంద్రవరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఒంటిపూట బడులు శనివారం నుంచి నిర్వహిస్తున్నామని డీఈవో కె.వాసుదేవరావు పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షా కేంద్రాలు ఉన్న పాఠశాలల్లో మధ్యాహ్నం 1:15 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ, మిగతా పాఠశాలల్లో ఉదయం 7:45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ తరగతులు నిర్వహిస్తారన్నారు. ఏప్రిల్ 23వ తేదీ వరకూ పాఠశాలలు ఉంటాయన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకూ ఇది వర్తిస్తుందని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలు ఉల్లంఘించి తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.



హోలీ.. రంగోళి

రాజమహేంద్రవరంలో శుక్రవారం హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు.. ఒకరికొకరు రంగులు పూసుకుంటూ ఆనందంగా గడిపారు.. రాజమహేంద్రవరం కార్పొరేషన్ కమిషనర్ కేతన్‌గార్గ్ ఉద్యోగుల మధ్య హోలీ పండుగ జరుపుకున్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు నగరంలో పలు చోట్ల రంగులు పూస్తూ సందడి చేశారు.



నగరంలో రెచ్చిపోతున్న ఆవారాగాళ్లు

ఇద్దరు విద్యార్థులపై దాడి
తరిమి..తరిమి కొట్టిన వైనం
స్థానికులు రావడంతో పరార్

రాజమహేంద్రవరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రశాంతమైన రాజమహేంద్రవరంలో ఆవారాగాళ్లు రెచ్చిపోతున్నారు.మద్యం, గంజాయి మైకంలో సాధారణ జన జీవనాన్ని బెంబేలెత్తిస్తున్నారు.దీనికి శుక్రవారం విద్యార్థులపై జరిగిన దాడిఘటనే ఉదాహరణ. ఒక ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న ఆశ్రిత్,శ్రీరామ్ ప్లైజర్ ద్విచక్ర వాహనంపై కళాశాల నుంచి సాయంత్రం నారాయణపురంలోని వాళ్ల ఇంటికి బయలుదేరారు. ఎఫ్‌సీఐ గోదాముల పక్క రోడ్డు సైక్లోన్ కాలనీ చివరలో ఉన్న పార్కు సమీపంలో ఇద్దరు యువకులు ఫూటుగా తాగేసి నలుగురు పిల్లల చెప్పులు తీసుకుని ఏడిపిస్తున్నారు.ఈ విషయం అటుగా వస్తున్న విద్యార్థులకు చెబుదామని నలుగురు పిల్లలు ఆపారు.ఈలోపు ఆ ఇద్దరు యువకులు వచ్చి విద్యార్థులపై దాడి చేసి కొట్టడం ఆరంభించారు. విద్యార్థులు ప్రాణభయంతో ద్విచక్ర వాహనంపై వేగంగా వెళుతుండగా వెనుక వస్తూ కొడుతూనే ఉన్నారు. సెంట్రల్ జైలు సమీపంలో విద్యార్థులు వెళుతున్న వాహనాన్ని గట్టిగా కాలితో తన్నారు.ఆర్ట్స్ కళాశాల జంక్షన్ వద్ద అటకాయించి మళ్లీ కొట్టడం మొదలు పెట్టారు.దీంతో ఇద్దరు విద్యార్థులు గాయాలపాలయ్యారు..ద్విచక్ర వాహనం తాళం కూడా లాక్కున్నారు. స్థానికులు ప్రశ్నించడంతో ఆ ఇద్దరు యువకులు విద్యార్థుల ద్విచక్రవాహన తాళం పట్టుకుని పరారయ్యారు.సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా యువకులను పోలీసులు గుర్తించి కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని స్థానికులు కోరారు.



గాయాలపాలైన విద్యార్థులు

కుటుంబ సమస్యలు.. పంచ ప్రాణాలు బలి!

గోదావరిలో దూకి దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. కాకినాడ జిల్లా తూరంగికి చెందిన దంపతులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు.. అయినా ఏదో విధంగా నెట్టుకొస్తున్నారు.. ఇల్లు అమ్మేసి అప్పులు తీర్చారు.. అయితే ఇటీవల కుమార్తె ప్రేమ వివాహం చేసుకోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు.. రాజమహేంద్రవరానికి చేరుకుని గోదావరిలో దూకి ప్రాణాలు తీసుకున్నారు. - 6లో

వేగం..విషాదం

తాడేపల్లిగూడెంలో లారీని ఢీకొన్న కారు

కుమార్తె సహా తల్లిదండ్రుల దుర్మరణం.. మరొకరికి గాయాలు.. మృతులది మండపేట

6

బాలాత్రిపుర సుందరికి విశేష పూజలు

కొవ్వూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో వేంచేసియున్న శ్రీబాలాత్రిపుర సుందరి అమ్మవారికి ఫాల్గుణ మాస పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం విశేషపూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మానేపల్లి శ్రీనివాసశాస్త్రి పర్యవేక్షణలో సుందర గణేష్ ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో ముత్యాల దండలతో అలంకరించి, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం లలిత సహస్రనామ పారాయణం గావించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



గోష్పాదక్షేత్రంలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

స్టీల్‌ప్లాంట్ నిర్వహణకు నిధులు కేటాయించాలి



నిడదవోలులో మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

నిడదవోలు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షిస్తామన్న హామీతో అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడేమో కేంద్రం అడుగులు మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నాయని ఐఎఫ్‌టీయూ నాయకుడు రవ్వా సురేష్‌కుమార్ అన్నారు. నిడదవోలు పట్టణంలో శుక్రవారం ఐఎఫ్‌టీయూ అనుబంధ సంస్థ అభ్యుదయ పెయింటర్స్ అండ్ ఆర్టిస్ట్స్ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ పాత అప్పులు తీర్చుకోవడానికి మాత్రమే కేంద్రం నిధులు విడుదల చేసిందన్నారు. అయితే ప్లాంట్ నిర్వహణకు, అవసరమైన ముడిసరుకు కొనుగోలుకు, ఉద్యోగుల జీతాలకు వినియోగించరాదన్న షరతుల వెనుక కుట్ర దాగి ఉందన్నారు. కార్యక్రమంలో పులుగా చైతన్య, మహేష్, రాజ్‌పాల్, నాగేంద్ర, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

తాళ్లపూడి, చాగల్లులో ఘనంగా లక్ష్మీ జయంతి

తాళ్లపూడి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి మెయిన్ రోడ్డులో గల శ్రీ రాజ్యలక్ష్మీ అమ్మవారి ఆలయంలో లక్ష్మీజయంతి సందర్భంగా శ్రీలక్ష్మీనా రాయణుల కల్యాణోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహిం చారు. వేదపండితులు పెద్దింటి శ్యామ్‌సుందర్ బ్రహ్మత్వంలో అర్చకులు గోవర్దనం మదన గోపాల్, గోవర్దనం చక్రవర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కల్యాణంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక కుంకుమ పూజలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కల్యాణ కార్యక్రమాన్ని నిర్వహించిన బ్రహ్మశ్రీ పెద్దింటి శ్యాంసుందర్ దంపతులను అర్చక దంపతులు ఘనంగా సత్కరించారు. అనంతరం భారీ అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



లక్ష్మీనారాయణుల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

చాగల్లు: స్థానిక శ్రీధనలక్ష్మీ ఆలయంలో శ్రీలక్ష్మీ జయంతి, హోలీని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కే గున్నేశ్వరరావు గుప్త దంపతులు పీటాలపై కూర్చుని కల్యాణం జరిపించారు. వేదపండితుల మంత్రోచ్చారణలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



చాగల్లులో కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

నేటి నుంచి ఒంటిపూట బడులు

గోపాలపురం, మార్చి14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు శనివారం నుంచి ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నట్టు ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు. సోమవారం నుంచి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పబ్లిక్ పరీక్షలు నిర్వహించే పాఠశాలలకు మధ్యాహ్నం నుంచి తరగతులు నిర్వహిస్తామన్నారు.



తాళ్లపూడిలో పార్టీ జెండాను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే రామారావు



నిడదవోలులో జనసేన ఆవిర్భావ వేడుకల్లో నాయకులు

'జనసేన' ఆవిర్భావ వేడుకలు

తాళ్లపూడి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా మాజీఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు హాజరయ్యారు. ప్రక్కిలంకలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని పార్టీ జెండాను ఎగురవేసి, జనసేన నాయకులు, కార్యకర్తల నడుమ కేకును కట్ చేశారు. సిద్దా నాగేశ్వరరావు, బరిగంటి శ్రీను, సంగాడి రాము, చెవ్వూరి రాము, కొలుకుల పెద్దబ్బులు, పూలపల్లి బాలకృష్ణ, ఆటపాకల రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు. అలాగే తాడిపూడిలో జనసేన మండలాధ్యక్షుడు గంటా కృష్ణ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఎంపీటీసీ సూర్యచంద్రం, శ్రీనివాస్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు. రావూరుపాడులో ఎంపీటీసీ వీర హరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలం నుంచి నాలుగు బస్సులు, ఐదు కార్లలో 250 మంది నేతలు, జనసైనికులు బయలుదేరి పిఠాపురం వెళ్లారు.

నిడదవోలు: నిడదవోలులో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గణేష్ చౌక్ సెంటర్‌లో జనసేన స్థూపం వద్ద మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రంగా రమేష్, భాను, షాకీరబేగం, బచ్చునాని, దాసం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు.

పిఠాపురం సభకు తరలిన జనసైనికులు

దేవరపల్లి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు శుక్రవారం నియోజకవర్గంలోని చిత్రాడలో జరిగే సభకు గోపాలపురం నియోజకవర్గం, పోలవరం, చింతలపూడి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద నుంచి భారీగా తరలి వెళ్లారు. వాహనాలకు జెండా ఊపి పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ సువర్ణరాజు ప్రారంభించారు. బాలరాజు, సువర్ణరాజు మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా చిత్రాడలో జరిగే జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు మూడు నియోజకవర్గాల నుంచి బస్సులపై కార్లు, మోటార్‌సైకిళ్లపై కార్యకర్తలు అభిమానులు, భారీ సంఖ్యలో బయళ్లేరటం జరి గిందన్నారు. భవిష్యత్తులో పవన్‌కల్యాణ్ ముఖ్య మంత్రి అయ్యే అవకాశం ఉందని వారు ఆశా భావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో చింతలపూడి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య, జనసేన నాయకులు మనుగూడి రవికుమార్, పసుపులేటి శివనాగ ప్రసాద్, మాధవరపు వెంకటేశ్వరరావు, చింతా తాతబ్బాయి, పోలుమాటి నాని, ఆనంద్‌ప్రసాద్, మద్దాల కాశీవిశ్వనాథం, కవల సీతారత్న సూర్యకుమారి, తదితరులు పాల్గొన్నారు.



దేవరపల్లిలో జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

ఉంగ్రాజవరం: జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం పిఠాపురం నియోజకవర్గం చిత్రాడలో ఘనంగా జరిగాయి. దీనిలో భాగంగా మండలంలోని పలుగ్రామాల నుంచి జనసేన నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో పిఠాపురం తరలివెళ్లారు. మండల జనసేన అధ్యక్షుడు వీరమళ్ల బాలాజీ ఆధ్వర్యంలో బస్సులు, కార్లను ఏర్పాటుచేశారు. దమ్మెన్నుకి చెందిన జనసేన నాయకులు దాసరి సుబ్రహ్మణ్యం, బందెల కామేశ్వరరావు, శీలంశెట్టి బస్సులు ఆర్థిక సహాయంతో సుమారు రూ.40 వేలు విలువైన గ్లూకోజ్‌వాటర్‌ను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్టిక్కర్‌తో కూడిన బాటిల్స్‌లో నింపి కార్యకర్తలకు అందజేసినట్టు పార్టీ మండల అధ్యక్షుడు బాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు జనసేన నాయకులు మాట్లాడుతూ రానున్న రోజుల్లో పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సీఎం కావడం ఖాయమన్నారు. జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఆనందంగా హోలీ పండుగ



కొవ్వూరు పట్టణంలో రంగులు జల్లుకుంటున్న చిన్నారులు

కొవ్వూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): దీపావళి తరువాత దేశంలో అత్యంత వేడుకగా చేసుకునే పండుగ హోలీ. ఫాల్గుణ మాసంలో వచ్చే పౌర్ణమిని హోలికా పూర్ణిమ అంటారు. దీన్ని పురస్కరించుకుని శుక్రవారం కొవ్వూరు పట్టణ, మండలంలో రంగుల పండుగ హోలీని ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు ఒకరిపై ఒకరు రంగులు పూసుకుంటూ ఆనందంగా జరుపుకున్నారు.

అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు



అయ్యప్పస్వామికి విశేష అభిషేకాలు చేస్తున్న అర్చకులు

తాళ్లపూడి, మార్చి14 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప జన్మదిన వేడుకలను శుక్రవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో గోదావరి నదికి తీసుకువెళ్లి స్నానమాచరించారు. అనంతరం ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి ప్రత్యేకపూజలు, అభిషేకాలు చేశారు. అర్చకబ్రహ్మ చేబోలు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

వైసీపీ కొవ్వూరు పట్టణ అధ్యక్షుడిగా అన్నవరం



చిట్టూరి అన్నవరం

కొవ్వూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణ వైసీపీ అధ్యక్షుడిగా చిట్టూరి అన్నవరాన్ని నియమించినట్టు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. శుక్రవారం నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన పట్టణ నాయకుల సమావేశంలో ప్రకటించారు. ఈ సందర్భంగా వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కంటమణి రమేష్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మెరిపో వీర్రాజు, గంధం సాయి, బోడపాటి హనుమంతరావు, అప్పల నాయుడు, మున్సిపల్ కౌన్సిలర్లు, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

కోటసత్తెమ్మను దర్శించుకున్న అదనపు జడ్జి అనురాధ



ఆలయంలో వేదాశీర్వచనాలు అందుకుంటున్న జడ్జి అనురాధ

నిడదవోలు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మని కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎం. అనురాధ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు అప్పారావుశర్మ జడ్జి దంపతులకు వేదాశీర్వచనాలు అందజేశారు.

సంక్షేమ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాజు



ముప్పిడిని సత్కరిస్తున్న అరుంధతి ఉపాధ్యాయ ఉద్యోగుల సంఘం ఉద్యోగులు

కొవ్వూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ముప్పిడిరాజు నియమితులయ్యారు. ఈ సందర్భంగా కొవ్వూరు సాంఘిక సంక్షేమ కార్యాలయంలో అరుంధతీ ఉద్యోగుల సంఘం నాయకులు రాజును సత్కరించి, అభినందనలు తెలిపారు. కొవ్వూరు డివిజన్ సహాయ సాంఘిక సంక్షేమ అధికారి మేరీ మాత, వసతిగృహ అధికారి శ్రీలత, రిటైర్ ఉద్యోగులు పెనుమాక జయరాజు, సనమండ్ర కాంతారావు, కే. భీష్మ గాంగేయుడు, తిగిరిపల్లి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక బహిష్కరణ చేయాలనుకోవడం అన్యాయం

కొవ్వూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): చిడిపిలో రజకులపై బీసీ సామాజిక వర్గానికి చెందినవారు సాంఘిక బహిష్కరణ చేయాలని చూడటం అన్యాయమని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు జువ్వల రాం బాబు అన్నారు. రెవిన్యూ, పోలీసు యం త్రాంగం నిర్లక్ష్యం వహిస్తే చిడిపి మరో తాడిపర్రు కాక తప్పదన్నారు. చిడిపిలో కేవీపీఎస్ నాయకుల బృందం శుక్రవారం పర్యటించింది. ఈసందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఈ గ్రామంలో గత 40 సంవత్సరాలుగా రజకులు ఉపయోగించుకుంటున్న ఎకరం 24 సెంట్ల చెల్లమ్మ చెరువులో బీసీ సామాజికవర్గానికి చెందినవారు ఓ దేవత, సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహాలను పెట్టి రజకులపై దౌర్జన్యం చేస్తున్నారన్నారు. ఇకనైనా జిల్లా కలెక్టర్, కొవ్వూ రు ఆర్డీవో, పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తక్షణం కోర్టు ఆదేశాల మేరకు చెరువుపై ఆక్రమణలు తొలగించాలని, లేనిచో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డి.అశోక్, వీ. రాంబాబు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు. దీనిపై గ్రామ పంచాయతీ కార్యదర్శి రామకృష్ణను వివరణను కోరగా చెల్లమ్మ చెరువు గట్టు ఆక్రమణలు తొలగించాలని హైకోర్టు ఆదేశాల మేరకు జనవరి 8వ తేదీన రెవెన్యూ, పోలీసు యం త్రాంగం సహాయంతో ఆక్రమణలు తొలగించడానికి చర్యలు చేపట్టామన్నారు. ప్రస్తుతం ఈ విషయమై హైకోర్టులో వాజ్యం నడుస్తుందని తెలిపారు.



చిడిపిలో పర్యటిస్తున్న కుల వివక్ష పోరాట సమితి నాయకులు

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

● కొవ్వూరు ఎంపీడీవో సుశీల

కొవ్వూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 16వ తేదీన నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కే. సుశీల తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశపు మందిరంలో ఆ రోజు ఉదయం 10 గంటలకు ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ (నారాయుడు) అధ్యక్షతన జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన, చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలపై చర్చిస్తామన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొవ్వూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : స్వయం ఉపాధి పథకాలకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంపీడీవో కే.సుశీల తెలిపారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న బీపీఎల్ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 22 వరకు అవకాశం ఉందన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వైసీపీ బలోపేతానికి కృషిచేద్దాం

● మాజీమంత్రులు తానేటి వనిత,చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

నల్లజర్ల, మార్చి14(ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో వైసీపీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీమంత్రులు తానేటి వనిత,చెల్లుబోయన వేణుగోపాలకృష్ణ అన్నారు. నల్లజర్లలో వైసీపీ మండలాధ్యక్షుడు వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం ఇంటి వద్ద ఆయన అధ్యక్షతన పార్టీ మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీమంత్రులు మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్యకర్త ఆత్మస్థైర్యం కలిగి ఉండాలని పేర్కొన్నారు. అప్పుడే మనం సమాజంలో రాణించగలుతామన్నారు. కార్యక్రమంలో బంకా అప్పారావు,పల్లి జ్యోతి,గూడూరి శ్రీను, అచ్యుత శివాజీ, చీపురుగూడెం పార్టీ అధ్యక్షుడు చెల్లు హరిబాబు, కొరపాటి హరిబాబు, గాలింకి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

వేగం.. విషాదం!

తాడేపల్లిగూడెం హైవేపై ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

కుమార్తె సహా తల్లిదండ్రుల దుర్మరణం.. మరొకరికి గాయాలు

తాడేపల్లిగూడెం రూరల్/మండపేట, మార్చి 14(ఆంధ్రజ్యోతి): వేగంగా వచ్చిన కారు ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ఒకే కుటుంబానికి చెందిన చిన్నారి సహా తల్లిదండ్రులు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన బోగిళ్ల పాపారావు రెండో కుమారుడు వెంకట సత్య సురేన్ (39) హైదరాబాద్‌లో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. అతడి భార్య నవ్య(36), కుమార్తె వాసవీ కృష్ణ(4), వారి బంధువు ఉప్పులూరి శ్రీరమ్యతో కలిసి కారులో మండపేట బయలుదేరారు. కుంచనపల్లి వచ్చేసరికి హైవే పనులు చేసేందుకు నిలుపుదల చేసిన లారీని కారు వేగంగా వచ్చి ఢీకొని తునాతునకలైంది. డ్రైవ్ చేస్తున్న సురేన్, నవ్య ఘటనా స్థలంలో మృతిచెందగా చిన్నారి వాసవి కృష్ణని తణుకు లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందు తూ చనిపోయింది. శ్రీరమ్య కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో రాజమండ్రిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రమేష్ తెలిపారు.

మండపేటలో విషాదఛాయలు

సురేన్ కుటుంబ సభ్యులు ముగ్గురు దుర్మరణం పాలవడంతో ఆయన స్వస్థలమైన మండపేటలో విషాదఛాయలు అలుముకు న్నాయి. ఆయన రామచంద్రపురం వీ ఎస్ఎం కళాశాలలో ఎంబీఏ చేశా డు. చాలాకాలం క్రితం హైదరాబాద్ వెళ్లి ప్రైవేటు జాబ్ చేసుకుంటూ అక్కడే కుటుంబంతో ఉంటున్నాడు. అతడి భార్య నవ్య కె.గంగవరం మండలం యండగండి వాసి. వారి కుమార్తె వాసవితో కలిసి కారులో బయలుదేరి శనివారం మండపేట లో బంధువుల ఇంట జరిగే శుభ కార్యక్రమానికి, ఏడిదలో శివాలయం లో విగ్రహాల ప్రతిష్ఠకు హాజరయ్యేందుకు వస్తున్న సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో ముగ్గురు చనిపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. క్షేమంగా ఇంటికి చేరతారన్న సమయంలో ఈ దుర్ఘటన జరగడంతో జీర్ణించుకోలేకపోతున్నారు.



మరణించిన కుటుంబసభ్యుల ఫైల్‌ఫొటో

గోదారిలో దూకేసిన దంపతులు

● ఒక వైపు ఆర్థిక ఇబ్బందులు..
● మరో వైపు కూతురి కోసం ఆవేదన
● భార్యాభర్తల ఆత్మహత్య

రాజమహేంద్రవరం, మార్చి 14 (ఆం ధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక కాకినాడకు చెందిన దంపతులు గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూరంగికి చెందిన కాళ్ల వెంకట రమణ (55) డ్రైవర్‌గా పనిచేస్తు న్నాడు. అతని భార్య వరలక్ష్మి (50) చీటీలు వేస్తారు. చాలాకాలంగా నమ్మకంగా ఉంటు న్నారు. దీంతో స్థానికులు కూడా ఎంతో నమ్మారు. ఈ క్రమంలో దాదాపు రూ. 60 లక్షల వరకూ అప్పులు చేశారు. తమ సొంతింటిని విక్రయించి రూ.45 లక్షల వరకూ అప్పులు తీర్చారు. ఇదిలా ఉండగా ఆరు నెలల కిందట ఒక్కగానొక్క కూతురు ప్రేమ వివాహం చేసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఒక వైపు కూతురి బాధ.. మరో వైపు అప్పులవాళ్ల పీడించడంతో మాన సికంగా నలిగిపోయారు. శుక్రవారం మధ్యా హ్నం సమయంలో రాజమండ్రి పిండాల రేవుకు వచ్చి కూతురిని తలచుకొని బాగా రోదించారు. తర్వాత ఇద్దరూ గోదావరిలోకి దిగిపోయి ప్రాణాలు విడిచారు. తాము ఆర్థిక ఇబ్బందులతో చచ్చిపోతున్నామంటూ గోదావరి గట్టుపై ఓ లెటర్‌ను ఉంచారు. తమ ఆధార్ కార్డులను కూడా అక్కడే పెట్టారు. స్థానికుల సమాచారంతో టూటౌన్ సీఐ మంగాదేవి ఆదేశాల మేరకు సిబ్బంది చేరుకొని గాలింపు చేపట్టారు. కొద్ది సమయంలో మృతదేహాలను గుర్తించారు. ఆధార్‌కార్డుల ఆధారంతో వారి చిరునామాను తెలుసుకొని బంధువులకు ఫోన్‌లో సమాచారమిచ్చారు. ప్రభుత్వాస్పత్రిలో శవపరీక్షల అనంతరం మృతదేహాలను సంబం ధీకులకు అప్పగించామని కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ మంగాదేవి తెలిపారు.



కాళ్ల వెంకటరమణ



వరలక్ష్మి

పొగాకు బ్యారెన్ దగ్ధం

● రూ. 8 లక్షల ఆస్తినష్టం



దేవరపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): యాదవోలులో పొగాకు బ్యారెన్‌లో శుక్రవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వలవల సత్యవతి బ్యారెన్స్‌ను అదే గ్రామానికి చెందిన ముమ్మిడి శ్రీనివాస్ అద్దెకు తీసుకుని పొగాకు క్యూరింగ్ చేస్తున్నాడు. ఈక్రమంలో శుక్రవారం పొగాకు క్యూరింగ్ చేస్తుండగా, ఆకులు బీడింగ్ గొట్టంపై పడటంతో మంటలు వ్యాపించడంతో కలప పూర్తిగా దగ్ధమైంది. జంగారెడ్డిగూడెం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. సుమారు రూ. ఎనిమిది లక్షల ఆస్తినష్టం జరిగినట్టు రైతులు, ఫైర్ అధికారులు గుర్తించారు.